



Truth of News
RNI NO : APTEL/25/A0239
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 260 | మంగళవారం 10 మార్చి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## ఇరాన్ సుప్రీం నేతగా
# మొజ్తాబా ఖమేనీ

**- ఎంపిక చేసిన నిపుణుల అసెంబ్లీ**

టెహ్రాన్ – సూర్య వాస్తవం :

ఇరాన్ సుప్రీం నేతగా సయ్యద్ మొజ్తాబా హొస్సేనీ ఖమేనీని (56) నిపుణుల అసెంబ్లీ ఎంపిక చేసింది. అమెరికా, ఇజ్రాయిల్ సేనల దాడిలో మరణించిన అయతొల్లా అలీ ఖమేనీ కుమారుడే మొజ్తాబా ఖమేనీ. ఇరాన్‌కు ఈయన మూడవ సుప్రీం నేతగా వ్యవహరించబోతున్నారు. ఇరాన్‌లో ప్రభుత్వ, సైనిక వ్యవహారాలలో తుది నిర్ణయం సుప్రీం నేతదే. మొజ్తాబా నియామకాన్ని అనేక పాశ్చాత్య దేశాలు తీవ్రంగా విమర్శించాయి. అయతొల్లా అలీ ఖమేనీ హత్యకు గురై వారం రోజులు దాటిన



తర్వాత నిపుణుల అసెంబ్లీ సమావేశమై మొజ్తాబాను సుప్రీం నేతగా ఎన్నుకుంది.

- మిగతా 2లో..

## యుద్ధంపై పార్లమెంటులో
# చర్చకు కేంద్రం 'నో'

**- అమెరికాకు లొంగిపోయారంటూ ప్రతిపక్షాల ఆగ్రహం**
**- వాడీవేడిగా బడ్జెట్‌సమావేశాలు**

న్యూఢిల్లీ – సూర్య వాస్తవం :

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయిల్‌ల యుద్ధం, ఇరాన్ ప్రతిదాడులు, గల్ఫ్‌లో భారతీయుల పరిస్థితి, దేశంలో ఇంధన సంక్షోభం, ధరల పెరుగుదల తదితర అంశాలపై చర్చకు కేంద్రం నిరాకరించడం పట్ల పార్లమెంట్‌లో ప్రతిపక్షాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. కేంద్ర ప్రభుత్వం.. అమెరికా, ఇజ్రాయిల్‌కు లొంగిపోయిందంటూ ఆగ్రహం వ్యక్తం చేశాయి.




రెండోదశ పార్లమెంటు బడ్జెట్ సమావేశాలు వాడివేడిగా కొనసాగుతున్నాయి. పశ్చిమాసియా వివాదాలకు సంబంధించిన అంశాలపై చర్చకు అనుమతి ఇవ్వని కేంద్రప్రభుత్వ వైఖరిపై పార్లమెంటులో తీవ్ర వ్యతిరేకత

- మిగతా 2లో..

## కాలుష్యరహిత నగరంగా
# మారుద్దాం

**- మూడు కమిషనరేట్‌ల ఏర్పాటుతో మీకు చేరువగా అధికారులు**
**- సమన్వయంతో పనులు చేయించుకునే బాధ్యత మీది : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి**

కూకట్ పల్లి – సూర్య వాస్తవం :




నగరాన్ని కాలుష్య రహిత నగరంగా మారుద్దామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం హైడ్రా ఆధ్వర్యంలో రూ.20కోట్లు వెచ్చించి హైదరాబాద్ కూకట్‌పల్లిలోని నల్ల చెరువును సుందరీకరించి అభివృద్ధి చేశారు. ఈ మేరకు సోమవారం స్థానిక ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, పీఏసీ చైర్మెన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, హైడ్రా కమిషనర్ రంగనాథ్, సీఎంసీ కమిషనర్ శ్రీజనతో కలిసి సీఎం చెరువును ప్రారంభించారు. ముందుగా చెరువు వద్ద పూజ చేసి గంగా హారతి ఇచ్చారు. అనంతరం నల్ల చెరువు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు. 'చెరువులను పునరుద్ధరించుకుందాం-వరదల నుంచి కాపాడుకుందాం' అని పిలుపునిచ్చారు. చిన్న

- మిగతా 2లో..

## గత ప్రభుత్వ తప్పిదాలను
# సరిదిద్దుతున్నాం

- సీఎం చంద్రబాబు
- నంద్యాల జిల్లా కొత్త బురుజులో రైతులకు పట్టాదార్ పాస్‌పుస్తకాల పంపిణీ
- ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ పేరుతో గత ప్రభుత్వం భూములు లాక్కునే ప్రయత్నం చేసిందన్న సీఎం
- రికార్డులు ట్యాంపరింగ్ కాకుండా క్యూఆర్ కోడ్, బ్లాక్ చైన్ టెక్నాలజీతో కొత్త పాస్‌పుస్తకాలు
- కేంద్ర సాయంతో రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని వెల్లడి
- గత ప్రభుత్వంలా విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై భారం మోపబోమని స్పష్టీకరణ



అమరావతి – సూర్య వాస్తవం :

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం నంద్యాల జిల్లా కొత్త బురుజు గ్రామంలో రైతులకు కొత్త పట్టాదార్ పాస్‌పుస్తకాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జరిగిన బహిరంగ సభలో ఆయన మాట్లాడుతూ.. గత వైసీపీ ప్రభుత్వం చేసిన తప్పులను కూటమి ప్రభుత్వం సరిదిద్దుతోందని స్పష్టం చేశారు. గత పాలకులు రెవెన్యూ వ్యవస్థను భ్రష్టు పట్టించారని,

- మిగతా 2లో..



## మహిళలు ఆత్మవిశ్వాసంతో
# ముందడుగు వేయాలి

**- బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ**

2 పేజీ

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## పశ్చిమాసియా సంక్షోభం..
# 67 వేల మంది భారతీయులు స్వదేశానికి

- మంత్రి జైశంకర్
- రాజ్యసభలో కీలక ప్రకటన చేసిన విదేశాంగ మంత్రి జైశంకర్
- ఇరాన్‌లోని భారతీయులకు టెహ్రాన్ ఎంబసీ అండగా నిలుస్తోందని వెల్లడి
- పలు దేశాల అధినేతలతో ప్రధాని మోదీ మాట్లాడారని, ఉద్రిక్తతలు తగ్గించాలని కోరారని వెల్లడి
- విపక్షాల నిరసనల మధ్యే సభకు వివరాలు అందించిన కేంద్ర మంత్రి

అమరావతి– సూర్య వాస్తవం :

పశ్చిమాసియాలో నెలకొన్న తీవ్ర ఉద్రిక్తతల నేపథ్యంలో అక్కడి నుంచి ఇప్పటివరకు 67,000 మంది భారతీయులు సురక్షితంగా స్వదేశానికి తిరిగి వచ్చారని విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్ వెల్లడించారు.



ఇవాళ ఆయన రాజ్యసభలో పశ్చిమాసియాలోని తాజా పరిణామాలపై ఒక ప్రకటన చేశారు. సంక్షోభం కొనసాగుతున్నప్పటికీ, భారతీయుల భద్రతకు, వారిని వెనక్కి తీసుకురావడానికి ప్రభుత్వం అన్ని చర్యలూ తీసుకుంటోందని స్పష్టం చేశారు. ఆయా ప్రాంతాల్లోని గగనతలాన్ని పాక్షికంగా తెరిచిన ప్రతీసారి, వాణిజ్య విమానాలతో పాటు ప్రత్యేక విమానాల ద్వారా భారతీయులను వెనక్కి తీసుకొస్తున్నామని తెలిపారు. ఈ నెల 8వ తేదీ నాటికి ఈ సంఖ్య 67,000కు చేరిందని అంచనా వేస్తున్నట్లు పేర్కొన్నారు. అయితే, ఈ అంశంపై పూర్తిస్థాయి చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ విపక్ష సభ్యులు నినాదాలు కొనసాగించడం గమనార్హం. వారి నిరసనల మధ్యే జైశంకర్ తన ప్రకటనను పూర్తి చేశారు. ఇరాన్‌లో ఉద్రిక్తతలు పెరగడంతో టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం అక్కడి విద్యార్థులకు, ఇతర పౌరులకు

- మిగతా 2లో..



# అవి ప్రభుత్వ హత్యలే

**- రాజమండ్రి కల్తీ పాల ఘటనలో 11 మంది మృతి**
**- ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యమే కారణమని షర్మిల తీవ్ర ఆరోపణ**
**- 11 ఏళ్లుగా లైసెన్స్ లేకుండానే వ్యాపారం జరిగిందని విమర్శ**
**- మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం ఇవ్వాలని డిమాండ్**
**- బాధితులను పరామర్శించని జగన్‌పై కూడా విమర్శలు**

రాజమండ్రి– సూర్య వాస్తవం :

రాజమండ్రిలో కల్తీ పాలు తాగి 11 మంది మరణించడంపై ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తీవ్రంగా స్పందించారు. ఈ మరణాలను ప్రభుత్వ హత్యలుగా అభివర్ణించిన ఆమె, రాష్ట్ర ప్రభుత్వ నేరపూరిత నిర్లక్ష్యం, ఆహార

- మిగతా 2లో..

# యుద్ధంపై పార్లమెంటులో చర్చకు కేంద్రం 'నో'

(మొదటి పేజీ తరువాయి)

వ్యక్తమైంది. చర్చకు అనుమతి ఇవ్వకుండా విదేశాంగ మంత్రి ప్రకటనతో ఈ అంశాన్ని ముగించాలన్న ప్రభుత్వ వైఖరిపై ఉభయ సభల్లోనూ ప్రతిపక్ష పార్టీలు నిరసన వ్యక్తం చేశాయి. 'దేశం తీవ్రమైన ఇంధన సంక్షోభం, ధరల పెరుగుదల దిశగా పయనిస్తోంది. లక్షలాది మంది భారతీయులు గల్ఫ్ దేశాలు, ఇరాన్‌లో చిక్కుకుపోయారు. ఈ అంశాలపై వివరణాత్మక చర్చ జరపకపోవడం పట్ల మోడీ ప్రభుత్వం వైఖరి ఆమోదయోగ్యం కాదు' అని ప్రతిపక్ష పార్టీలు తమ వైఖరిని స్పష్టం చేశాయి. లోక్‌సభ సోమవారం ప్రారంభం కాగానే గల్ఫ్ యుద్ధం, చమురు ధరలు, భారతీయుల తరలింపు వంటి అంశాలను ప్రతిపక్షం లేవనెత్తింది. దీనిపై సభలో ప్రతిపక్ష సభ్యులు భారీ ఎత్తున నినాదాలు హోరెత్తించారు. ఇరాన్ యుద్ధంపై, పెరుగుతోన్న చమురు ధరలపై చర్చించాలని, అలాగే ఇరాన్ సహా గల్ఫ్‌లో చిక్కుకున్న భారతీయుల్ని రక్షించాలని కోరుతూ సభలో డిమాండ్ చేశారు. అమెరికా అధ్యక్షులు ట్రంప్‌నకు మోడీ లొంగిపోయారని విమర్శించారు. ఈ అంశాలపై చర్చించాలని డిమాండ్ చేశారు. దీనికి ప్రభుత్వం అంగీకరించలేదు. ప్రతిపక్ష సభ్యులు నినాదాలు హోరెత్తించడంతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది. దీంతో పలుమార్లు సభ వాయిదా పడింది. చివరకు మధ్యాహ్నం మూడు గంటలకు సభను వాయిదా వేశారు. అనంతరం సభ మంగళవారానికి వాయిదా వేశారు. ఆ తర్వాత ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ మీడియాతో మాట్లాడారు. ఇరాన్‌పై యుద్ధం మన దేశంపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. దేశ ఆర్థిక పరిస్థితి దిగజారుతుందని, ఇప్పటికే స్టాక్ మార్కెట్లు నష్టపోతున్నాయని అన్నారు. చమురు ధరలు కూడా పెరుగుతున్నాయని, ఇవన్నీ ప్రజా సమస్యలే అని రాహుల్ పేర్కొన్నారు. ప్రతిపక్షాల ఆందోళన కారణంగా సోమవారం స్పీకరు ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానాన్ని పరిగణనలోకి తీసుకోలేదు. పశ్చిమాసియా ప్రాంతంలోని పరిస్థితిపై విదేశాంగ మంత్రి ఎస్ జైశంకర్ ఉభయ సభల్లోనూ ప్రకటన చేశారు. మరోవైపు పార్లమెంటు ముఖద్వారం వద్ద కూడా ప్రతిపక్షాలు బ్యానర్లు ఎగురవేశారు. 'గల్ఫ్ కాలిపోతోంది, చమురు ధరలు పెరుగుతున్నాయి, భారతీయులు చిక్కుకుపోయారు' అని బ్యానర్‌లో రాసి ఉంది. బడ్జెట్ సమావేశాల మొదటి దశలో నిరసన తెలిపినందుకు సస్పెండ్ అయిన ఎంపిలు కూడా పార్లమెంటు వెలుపల నిరసనలో పాల్గొన్నారు.

# గత ప్రభుత్వ తప్పిదాలను సరిదిద్దుతున్నాం

(మొదటి పేజీ తరువాయి)

ల్యాండ్ టైట్లింగ్ యాక్ట్ పేరుతో రైతులు, పేదల భూములను లాక్కునే ప్రయత్నం చేశారని ఆరోపించారు. రాజకీయ కక్ష సాధింపులు, అక్రమ ఆక్రమణల కోసమే గత ప్రభుత్వం 1.95 కోట్ల ఎకరాలను సెక్షన్ 22ఏ కింద నిషేధిత జాబితాలో పెట్టిందని సీఎం మండిపడ్డారు. తాము అధికారంలోకి రాగానే ఆ చట్టాన్ని రద్దు చేసి, రికార్డుల్లోని తప్పులను సరిచేస్తున్నామని చెప్పారు. గత పాలకులు పాస్ పుస్తకాలపై, సర్వే రాళ్లపై తమ ఫోటోలు వేసుకుని రూ.750 కోట్లు వృథా చేశారన్నారు. రైతుల సమక్షంలోనే కొలతలు వేసి, వారి ఆమోదంతోనే ఎలాంటి అవినీతికి తావులేకుండా పారదర్శకంగా కొత్త పుస్తకాలు ఇస్తున్నట్లు వివరించారు. క్యూఆర్ కోడ్, బ్లాక్ చైన్ టెక్నాలజీని వినియోగిస్తున్నామని, దీనివల్ల రికార్డులను ఎవరూ ట్యాంపరింగ్ చేయలేరని, అధికారులు తప్పు చేసినా ఇట్టే తెలిసిపోతుందని పేర్కొన్నారు. రాయలసీమను హార్టికల్చర్ హబ్‌గా మారుస్తామని సీఎం పునరుద్ఘాటించారు. ఇందుకోసం పూర్వోదయ పథకం కింద కేంద్రం రూ.30 వేల కోట్లు ఇస్తుందని తెలిపారు. కర్నూలులో డ్రోన్ సిటీ, అనంతపురంలో ఏరోస్పేస్ సిటీ ఏర్పాటు చేస్తామన్నారు. గత ప్రభుత్వం ఎనిమిది సార్లు విద్యుత్ ఛార్జీలు పెంచి ప్రజలపై రూ.32 వేల కోట్ల భారం మోపిందని, కూటమి ప్రభుత్వం ఛార్జీలు పెంచబోదని హామీ ఇచ్చారు. అలాగే, తిరుపతి లడ్డూ వ్యవహారంపై ప్రతిపక్షం తప్పుడు ప్రచారం చేస్తోందని, శ్రీవారి పవిత్రతను దెబ్బతీసే ఎలాంటి చర్యలనూ సహించేది లేదని చంద్రబాబు హెచ్చరించారు. రాష్ట్రానికి భారీగా పెట్టుబడులు వస్తున్నాయని ఆయన హర్షం వ్యక్తం చేశారు.

# కాలుష్యరహిత నగరంగా మారుద్దాం

(మొదటి పేజీ తరువాయి)

వర్షాలకు ఇండ్లలోకి వరదలు వచ్చి విలువైన వస్తువులు నష్టపోయిన కుటుంబాల బాధలు చూశానని, ఇక ముందు అలాంటివి జరగకుండా ఉండేందుకు చెరువులను పునరుద్ధరించుకుందామని అన్నారు. రాజకీయాలకు, పార్టీలకు అతీతంగా ఏ పార్టీ ఎమ్మెల్యే నియోజకవర్గం అభివృద్ధికి అయినా నిధులు మంజూరు చేస్తానని తెలిపారు. ఎవరెన్ని విమర్శలు చేసినా, తీవ్ర ఆరోపణలు చేసినా ప్రజా క్షేమానికి, అభివృద్ధి కోసం హైడ్రా ప్రారంభించామని చెప్పారు. తనకు ఎలాంటి దురుద్దేశం లేదు కాబట్టి ఎవరెన్ని తిట్లు తిట్టినా భరించానని, ఇక్కడ చేసిన అభివృద్ధి చూసి, ఇక్కడి ప్రజలు చిరునవ్వు చూస్తే తనను తిట్టిన తిట్లని మరిచిపోతున్నానని అన్నారు. రోడ్ల విస్తరణలో కొందరికి నష్టం కలిగినా, ఎవరైనా నిర్వాసితులుగా మారినా వారి వివరాలు సేకరిస్తే వారికి డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లు కేటాయిస్తామని, భూములు నష్టపోయిన వారికి టీడీఆర్ ఇస్తామని తెలిపారు. కోటీ ముప్పై నాలుగు లక్షల జనాభా ఉన్న నగరాన్ని గొప్ప నగరంగా మార్చేవడానికి మూడు కమిషనరేట్‌లుగా ఏర్పాటు చేసుకొని అధికారులను ప్రజలకు మరింత చేరువ చేసినట్టు తెలిపారు. వారిని సమన్వయం చేసుకుని పనులు చేయించుకునే బాధ్యత మీదేనని అన్నారు. రాజకీయంగా తాను కష్టకాలంలో ఉండగా ఆదుకున్నది మీరేనని, మీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయడం తన బాధ్యత అని తెలిపారు. డిల్లీలో కాలుష్యం కారణంగా సెలవులు ప్రకటిస్తున్నారని, మన హైదరాబాద్ నగరం సురక్షితమైనదని, కాలుష్య రహిత నగరంగా అభివృద్ధి చేసుకుందామని అన్నారు. మూసీ ప్రక్షాళన చేసి పునరుద్ధరణ చేసుకుందామని తెలిపారు.

**నల్ల చెరువు అభివద్ధి చేసినందుకు ముఖ్యమంత్రికి ధన్యవాదాలు : ఎమ్మెల్యే మాధవరం కష్ణారావు**

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ.. తాను పుట్టిన ఊరులో ఉన్న నల్ల చెరువు అభివృద్ధి చేసుకోవడం సంతోషంగా ఉందని, నల్ల చెరువు అభివృద్ధి చేసినందుకు సీఎం రేవంత్ రెడ్డికి, హైడ్రా కమిషనర్ రంగనాథ్‌కు ధన్యవాదాలు తెలిపారు. అలాగే ముల్లకత్వ చెరువు, బోయిన్ చెరువులు సైతం అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని, ట్రక్ పార్క్‌లో క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేయాలని కోరారు.

# ఇరాన్ సుప్రీం నేతగా మొజ్తాబా ఖమేనీ

(మొదటి పేజీ తరువాయి)

88 మంది సభ్యులతో కూడిన నిపుణుల అసెంబ్లీ ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత మొజ్తాబా నియామకాన్ని ధృవీకరించింది. 'ఇస్లామిక్ రిపబ్లిక్ ఆఫ్ ఇరాన్ పవిత్ర వ్యవస్థకు మూడవ నేతగా సయ్యద్ మొజ్తాబా హొస్సేనీ ఖమేనీని నిర్ణయాత్మక ఓటు ద్వారా నిపుణుల అసెంబ్లీ ఎన్నుకుంది' అంటూ ఒక ప్రకటన విడుదల చేసింది.

**ఆధ్యాత్మికం నుంచి రాజకీయం వైపు...**

1969లో ఉత్తర ఇరాన్‌లోని ఆధ్యాత్మిక పట్టణమైన మష్‌హాద్‌లో మొజ్తాబా జన్మించారు. 1979 వరకూ ఇరాన్‌ను పరిపాలించిన షా రాజ వంశానికి వ్యతిరేకంగా తన తండ్రి జరిపిన పోరా టాన్ని చూస్తూ ఎదిగారు. మతపరమైన వాతా వరణంలో ఎదుగుతూ వచ్చిన మొజ్తాబా ఇరాన్- ఇరాక్ యుద్ధ సమయంలో పార్లమెంటరీ రివల్యూ షనరీ గార్డ్‌లో విభాగమైన హబీబ్ బిన్ మజాహిర్ బెటాలియన్ కింద పనిచేశారు. ఆ సమయంలో ఆయనకు అనేక మంది అధికారులతో సంబంధాలు ఏర్పడ్డాయి. అయితే ఆయన ఎన్నడూ రాజకీయ కార్యాలయంలో పనిచేయలేదు. మత పరమైన విద్యను అభ్యసించి ఓ గురువుగానే కొన సాగారు. 1989లో తండ్రి ఖమేనీ సుప్రీం నేత అయిన తర్వాత మొజ్తాబా ప్రభావం గణనీయంగా పెరుగుతూ వచ్చింది. ఆ సమయంలో ఆయన ఓ విశ్వాసపాత్రు డిగా, రక్షకుడిగా, పవర్ బ్రోకర్‌గా వ్యవహరించారు. అంతేకాక అపారమైన వ్యాపార వ్యవస్థను నిర్మించారు. భద్రతా సంస్థతో లోతైన సంబంధాలు నెరిపారు.

**ఎక్కువ కాలం ఉండడు : ట్రంప్**

ఇరాన్ సుప్రీం నేతగా ఎవరు ఎన్నికైనప్పటికీ వాషింగ్టన్ అనుమతి లేకుండా అధికారంలో కొనసాగలేరని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అంతకుముందు హెచ్చరించారు. ఇరాన్ సుప్రీం నేతకు తమ అనుమతి అవసరమని స్పష్టం చేశారు. తమ నుంచి అనుమతి లేకుంటే ఎక్కువ కాలం అధికారంలో కొనసాగలేడని చెప్పారు. మొజ్తాబాను పట్టించుకోవాల్సిన అవసరం లేదని, ఆయన ఆమోదయోగ్యమైన వ్యక్తి కాదని ట్రంప్ గతంలోనే తెలిపారు. మొజ్తాబా ఎన్నడూ ఎన్నిక కాలేదని, ప్రభుత్వ పదవిలో నియమితుడు కాలేదని ఆరోపిస్తూ 2019లో అమెరికా వాణిజ్య శాఖ ఆయనపై ఆంక్షలు విధించింది.

**పశ్చిమ దేశాలకు వ్యూహాత్మక సంకేతం**

ఖమేనీ తన హయాంలో ఇరాన్ రివల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ)కి మద్దతుగా నిలవడంతో అందులో మొజ్తాబా ప్రాబల్యం గణనీయంగా పెరిగింది. ఐఆర్‌జీసీ విభాగాలకు చెందిన కమాండర్లతో ఆయన సన్నిహితంగా పనిచేశారు. అధికారులతో ఉన్న సాన్నిహిత్యం కారణంగా శుద్ధి చేసిన కీలక యురేనియం నిల్వలను తరచూ పరిశీలిస్తుండే వారు. మహమూద్ అహ్మదీనెజాబ్ రెండోసారి దేశాధ్యక్షుడు కావడానికి ఆయన మద్దతు తెలిపారు.

మొజ్తాబాపై 2019లో అమెరికా వాణిజ్య మంత్రిత్వ శాఖ ఆంక్షలు విధించింది. మొజ్తాబా గతంలో అవలంబించిన కఠిన వైఖరి నేపథ్యంలో ఆయన నియామకాన్ని పశ్చిమ దేశాలకు వ్యూహాత్మక సంకేతంగా చూస్తున్నారు. ఇరాన్ ఆచితూచి అడుగులు వేయాలంటూ వస్తున్న వాదనలను మొజ్తాబా ఎంపిక ద్వారా నిపుణుల అసెంబ్లీ తోసిపుచ్చింది. ఎందుకంటే ఆయన గతంలో అనేక సందర్భాలలో కఠిన వైఖరి అవలంబించారు. అందుకే ఆయన ఎంపికపై పశ్చిమ దేశాలు తీవ్ర విమర్శలు చేశాయి. ఇజ్రాయిల్ అయితే ఓ అడుగు ముందుకు వేసి నిపుణుల అసెంబ్లీ సమావేశానికి ఆటంకం కలిగిస్తానని బెదిరించింది.

**ఎంపిక సమయంలో బాంబుల మోత**

సుప్రీం నేత ఎన్నిక ప్రక్రియ జరుగుతున్న సమయంలోనే బాంబు పేలుళ్లలో టెహ్రాన్ నగరం దద్దరిల్లింది. ఇంధన డిపోలు, సైనిక మౌలిక సదుపాయాలే లక్ష్యంగా బాంబు దాడులు జరిగాయి. ఇజ్రాయిల్, అమెరికా సేనలు క్షిపణులను కూడా ప్రయోగించాయి. దీంతో నగరమంతటా దట్టమైన పొగలు అలముకున్నాయి.

**మొజ్తాబా హత్యకు ట్రంప్ కుట్ర ?**

ఇరాన్ సుప్రీం నేతగా ఎన్నికైన అలీ ఖమేనీ తనయుడు మొజ్తాబా ఖమేనీని కూడా తండ్రిని చంపినట్లుగానే హతమార్చాలని అమెరికా భావిస్తోందా?. జరుగుతున్న పరిణామాలు, అగ్రరాజ్యం అధినేత చేస్తున్న ప్రకటనలను చూస్తుంటే ఈ ప్రశ్నకు అవుననే సమాధానమే వస్తోంది. తమ అనుమతి లేకుండా మొజ్తాబా ఖమేనీ ఎక్కువ కాలం ఇరాన్ నేతగా కొనసాగలేరని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ గతంలో ఏబీసీ న్యూస్‌కు చెప్పారు. ఇరాన్ సుప్రీం నేతగా అయతొల్లా మొజ్తాబా ఖమేనీ ఎంపిక కాబోతున్నారంటూ వస్తున్న వార్తలపై ఆయన ప్రశ్నించగా 'ఏం జరుగుతుందో చూద్దాం' అని వ్యాఖ్యానించారు. మొజ్తాబా ఎంపికపై విమర్శలు చేసేందుకు టైమ్స్ ఆఫ్ ఇజ్రాయిల్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆయన నిరాకరించారు. ఇజ్రాయిల్ మాత్రం ఇరాన్‌కు ఎవరు నేతగా ఎన్నికైనప్పటికీ దాడి చేస్తానని హెచ్చరించింది. ఇరాన్ సుప్రీం నేత పదవికి మొజ్తాబా ఖమేనీ పేరు తొలుత వినిపించినప్పుడు అలాంటి ప్రయత్నం తనకు అంగీకారయోగ్యం కాదని ట్రంప్ స్పష్టం చేశారు. అధికార ప్రకటన విడుదలైన తర్వాత మాత్రం ఎలాంటి ప్రకటన విడుదల చేయలేదు. తమ అంగీకారం లేకుంటే మొజ్తాబా ఎక్కువ కాలం ఇరాన్ సుప్రీం నేతగా కొనసాగలేరని ట్రంప్ గతంలో హెచ్చరించినప్పటికీ నిపుణుల అసెంబ్లీ మాత్రం ఆయననే ఎంపిక చేయడం గమనార్హం.

జరుగుతున్న పరిణామాలను పరిశీలిస్తే మొజ్తాబా నియామకం అమెరి కాకు సుతరామూ ఇష్టం లేదని అర్థమవుతోంది. ఆయనపై 2019లోనే అమెరికా వాణిజ్య మంత్రిత్వ శాఖ ఆంక్షలు విధించింది. అలీ ఖమేనీ ప్రాంతీయ ఆకాంక్షలు, ఆశయాలను అస్థిరపరచే ప్రయత్నం చేశారని, అణచివేత విధానాలను అవలంబించారని, ఆయన కుమారుడు మొజ్తాబా కూడా తండ్రి బాటలోనే పయనిస్తున్నారని అమెరికా ఆరోపిస్తోంది. అలీ ఖమేనీకి అమెరికా పొడ ఏ మాత్రం గిట్టని విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో అలీ ఖమేనీని అంతం చేసిన ట్లుగానే మొజ్తాబా ఖమేనీని కూడా హతమార్చడానికి ట్రంప్ ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తూ ఉండవచ్చునని విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.

# పశ్చిమాసియా సంక్షోభం..

# 67 వేల మంది భారతీయులు స్వదేశానికి

(మొదటి పేజీ తరువాయి)

సహాయం అందించడానికి చర్యలు తీసుకుందని జైశంకర్ వివరించారు. పలువురు విద్యార్థులను సురక్షిత ప్రాంతాలకు తరలించామని చెప్పారు. వ్యాపార నిమిత్తం ఇరాన్‌లో ఉన్న భారతీయులు, పొరుగున ఉన్న అర్మేనియాకు వెళ్లి అక్కడి నుంచి స్వదేశానికి తిరిగి వచ్చేలా ఏర్పాట్లు చేశామని తెలిపారు. టెహ్రాన్‌లోని ఎంబసీ పూర్తిస్థాయిలో పనిచేస్తోందని, అత్యంత అప్రమత్తంగా ఉందని స్పష్టం చేశారు. పశ్చిమాసియాలోని పరిణామాలను ప్రధాని మోదీ ఎప్పటికప్పుడు సమీక్షిస్తున్నారని జైశంకర్ సభకు తెలిపారు. యూఏఈ, ఖతార్, సౌదీ అరేబియా, ఒమాన్, జోర్డాన్, ఇజ్రాయెల్, బహ్రెయిన్ దేశాధినేతలతో ప్రధాని మాట్లాడారని వెల్లడించారు. ఉద్రిక్తతలను తగ్గించాలని అన్ని పక్షాలను కోరుతున్నామని చెప్పారు. తాను కూడా ఆయా దేశాల విదేశాంగ మంత్రులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నట్లు పేర్కొన్నారు. భారత సమాజం భద్రత, సంక్షేమానికి తమ దేశాలు ప్రాధాన్యతనిస్తాయని ఆయా దేశాల నాయకత్వాలు హామీ ఇచ్చాయని తెలిపారు. అమెరికాతో కూడా దౌత్య మార్గాల ద్వారా నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నామని ఆయన తన ప్రకటనలో పేర్కొన్నారు.

(మొదటి పేజీ తరువాయి)


భద్రతా వైఫల్యమే ఈ ఘోరానికి కారణమని ఆరోపించారు. నేడు రాజమండ్రిలోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన అనంతరం ఆమె మీడియాతో మాట్లాడారు. ఇది ప్రమాదం కాదని, అధికారుల ఉదాసీనత వల్లే జరిగిందని అన్నారు. వరలక్ష్మి అనే పాల వ్యాపారి దాదాపు 11 ఏళ్లుగా ఎలాంటి లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తున్నా, ఫుడ్ సేఫ్టీ అధికారులు చర్యలు తీసుకోకపోవడం దారుణమని విమర్శించారు. అధికారులకు తెలియకుండా ఇన్నేళ్లుగా అక్రమ వ్యాపారం ఎలా సాధ్యమైందని ఆమె ప్రశ్నించారు. ఇథిలీన్ గ్లైకాల్ కలిపిన పాలు తాగడం వల్లే పలువురు తీవ్ర అస్వస్థతకు గురయ్యారని, కొందరు వెంటిలేటర్‌పై ప్రాణాలతో పోరాడుతున్నారని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో పాలు, నెయ్యి, మద్యం, తాగునీరు సహా అన్ని నిత్యావసరాలు కల్తీమయం అవుతున్నా, సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. రాజమండ్రి వంటి నగరానికి ఒక్కరే ఫుడ్ సేఫ్టీ అధికారి ఉండటం, ఆయన కూడా స్థానికంగా అందుబాటులో లేకపోవడం సిబ్బంది కొరతకు నిదర్శనమన్నారు. ఈ ఘటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నైతిక, పరిపాలనా బాధ్యత వహించాలని షర్మిల డిమాండ్ చేశారు. ఫుడ్ సేఫ్టీ విభాగంలో వెంటనే భారీగా నియామకాలు చేపట్టి, కఠిన తనిఖీలు నిర్వహించాలన్నారు. మృతుల కుటుంబాలకు ప్రకటించిన రూ. 10 లక్షల పరిహారాన్ని రూ. 25 లక్షలకు పెంచాలని కోరారు. బాధితులను మాజీ ముఖ్యమంత్రి జగన్ ఇప్పటివరకు పరామర్శించకపోవడం సరికాదని అన్నారు. సామాన్య ప్రజల పట్ల ఆయన వైఖరి ఏంటో దీని ద్వారా తెలుస్తోందని విమర్శించారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని ఆహార భద్రతా నిబంధనలను కఠినంగా అమలు చేయకపోతే ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం అవుతాయని హెచ్చరించారు.

# అవి ప్రభుత్వ హత్యలే

# మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలి

## - బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ

**శ్రీ సత్య సాయి బ్యూరో – సూర్య వాస్తవం:** మహిళలు సమాజంలో ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి కవితమ్మ పేర్కొన్నారు సోమవారం శ్రీ సత్యసాయి జిల్లా పెనుకొండలో స్త్రీ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమంలో మంత్రి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ముందుగా బాల్య వివాహాలపై నూతనంగా ఏర్పాటుచేసిన ప్రచార రథాన్ని మంత్రి సవితమ్మ జిల్లా కలెక్టర్ ఏ శ్యాంప్రసాద్ ఎస్పీ సతీష్ కుమార్ ప్రారంభించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పెనుకొండ పట్టణంలో నియోజకవర్గ స్థాయి వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా మహిళా అభివృద్ధి మరియు శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవితమ్మ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఐసిడిఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ ప్రమీల అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్, జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ముఖ్య అతిథిగా హాజర య్యారు. మహిళలు మరియు పిల్లల సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించేలా రూపొందించిన ప్రత్యేక ప్రచార రథాన్ని మంత్రి, కలెక్టర్ కలిసి లాంఛనంగా ప్రారంభించారు.'అక్షరాంధ్ర' కార్యక్రమం ద్వారా మహిళలు విద్యావంతులు కావాలని, తద్వారా కుటుంబం సమాజ అభివృద్ధిలో కీలక పాత్ర పోషించాలని వారు సూచించారు.మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేయాలని పిలుపునిచ్చారు.స్థానిక ప్రభుత్వ కళాశాల మైదానంలో నూతనంగా నిర్మించిన బహిరంగ వేదికను మంత్రి, జిల్లా కలెక్టర్ కలిసి ఘనంగా ప్రారంభించారు.కళాశాల విద్యార్థుల సాంస్కృతిక ప్రదర్శనలకు, క్రీడా కార్యక్రమాలకు, ఇతర ముఖ్య సమావేశాలకు అనుగుణంగా ఈ వేదికను అత్యాధునిక వసతులతో నిర్మించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, భారీ సంఖ్యలో మహిళా సంఘాల సభ్యులు మరియు ప్రజలు పాల్గొన్నారు.



# సంపాదకీయం

## ఉచితాల వరదలో విజయ్...



తమిళనాడు రాజకీయాల్లో దళపతి విజయ్ తన తమిళగ వెట్రి కళగం పార్టీ ద్వారా ప్రకటిస్తున్న ఉచితాల వరద ఇప్పుడు రాష్ట్రవ్యాప్తంగా పెను చర్చకు దారితీస్తోంది. ముఖ్యంగా ముఖ్యమంత్రి స్టాలిన్ అమలు చేస్తున్న పథకాలకు రెట్టింపు ప్రయోజనాలు కల్పిస్తామన్న ఆయన హామీలు అటు ఆకర్షణీయంగా కనిపిస్తున్నా, ఇటు విమర్శలకు పదును పెడుతున్నాయి. విజయ్ అనుసరిస్తున్న ఈ వ్యూహం రెండు వైపులా పదునున్న కత్తి లాంటిది. ఒకవైపు ప్రజలను ఆకట్టుకునే ప్రయత్నం చేస్తున్నా, మరోవైపు ఆయన రాజకీయ పరిణతిని ఇది ప్రశ్నార్థకం చేస్తోంది.కనీసం వార్డు మెంబర్‌గా కూడా అనుభవం లేని విజయ్, నేరుగా ముఖ్యమంత్రి పీఠంపై కన్నేసి ఇలాంటి భారీ హామీలు ఇవ్వడంపై మేధావి వర్గాల్లో సందేహాలు వ్యక్తమవుతున్నాయి. పరిపాలనా అనుభవం సున్నా అయిన వ్యక్తి, రాష్ట్ర ఖజానాపై పడే వేల కోట్ల భారాన్ని ఎలా మేనేజ్ చేస్తారనేది ప్రధాన ప్రశ్న. స్టాలిన్ ప్రభుత్వం ఇప్పటికే అప్పుల ఊబిలో ఉన్న రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని చక్కదిద్దేందుకు కష్టపడుతుంటే, విజయ్ అంతకు రెట్టింపు ఇస్తాననడం అసాధ్యమైన హామీ గా ప్రజలు భావించే ప్రమాదం ఉంది. ఇది ఆయనను ఒక 'సీరియస్ పొలిటీషియన్ గా కాకుండా, కేవలం ఓట్ల కోసం ఆశ చూపే సినిమా గ్లామర్ నేతగా ముద్ర వేసే అవకాశం ఉంది.విజయ్ పార్టీపై యువతలో ఉన్న ప్రధాన ఆశ మార్పు . దశాబ్దాలుగా ద్రవిడ పార్టీల మధ్య నలిగిపోతున్న తమిళనాట ఒక కొత్త రాజకీయ సంస్కృతి వస్తుందని ఆశించిన వారికి, ఈ ఉచితాల ప్రకటనలు తీవ్ర నిరాశను కలిగిస్తున్నాయి. ఇతర రాజకీయ నాయకులలాగే విజయ్ కూడా ఉచితాలనే నమ్ముకోవడం వల్ల, ఆయన ప్రత్యేకత ఏముందనే ప్రశ్న తలెత్తుతోంది. మార్పు కోరుకునే ఓటర్లు కేవలం డబ్బు లేదా వస్తువుల కోసం ఓటు వేయరు. వారు వ్యవస్థాగత మార్పును కోరుకుంటారు. ఈ క్రమంలో విజయ్ తనకున్న యూత్ ఐకాన్ ఇమేజ్‌ను కోల్పోయి, పాతతరం రాజకీయాలనే పునరావృతం చేస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి.అధికారమే పరమావధిగా ఆయన దేనికైనా తెగిస్తున్నారనే సంకేతాలు వెళ్తున్నాయి. కేవలం గెలవడమే లక్ష్యంగా ఇలాంటి హామీలు ఇచ్చి, అధికారంలోకి వచ్చాక నిధులు లేవు అనే సాకుతో చేతులెత్తేస్తారేమో అన్న భయం సామాన్యుల్లో కలగడం సహజం. డీఎంకే, ఏఐఏడీఎంకే వంటి బలమైన క్యాడర్ ఉన్న పార్టీలను ఢీకొట్టాలంటే ఈ మాత్రం షో ఉండాలని విజయ్ వర్గం వాదిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో ప్రజలు ఆయన మాటల్లోని నిజాయితీని ఎంతవరకు నమ్ముతారన్నదే ఇక్కడ అసలు పాయింట్. తమిళ రాజకీయాల్లో ఉచితాలు అనేవి గెలుపు గుర్రాలుగా మారిన చరిత్ర ఉంది. అందుకే ఏ చిన్న అవకాశాన్ని వదిలిపెట్టకూడదనే పట్టుదలతో ఆయన పథకాల వరద పారిస్తున్నారు. అయితే, సినిమా స్క్రిప్ట్ లాగా హామీలు ఇవ్వడం సులభం కానీ, బడ్జెట్ అంకెలను సరితూచడం కష్టమనే నిజాన్ని ఆయన త్వరలోనే గ్రహించాల్సి ఉంటుంది.

తమిళనాడు రాజకీయాల్లో అధికారంలో వాటా ఇస్తామంటూ సరికొత్త ప్రకటనతో సంచలనం సృష్టించిన తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్ ప్రస్తుతం క్లిష్ట పరిస్థితిని ఎదుర్కొంటున్నారు. డీఎంకే వంటి బలమైన పార్టీని ఎదుర్కోవడానికి ఇతర పార్టీలతో కూటమి కట్టాలని ఆయన చేసిన ప్రయత్నాలు ఆశించిన ఫలితాన్ని ఇవ్వలేదు. తన మొదటి బహిరంగ సభలోనే మిత్రపక్షాలకు రెడ్ కార్పెట్ పరిచిన విజయ్ ఆఫర్‌పై తొలత కాంగ్రెస్, వీసీకే వంటి పార్టీలు ఆసక్తి చూపినప్పటికీ అవేవీ డీఎంకే కూటమిని వీడలేదు. ముఖ్యమంత్రి స్టాలిన్ వ్యూహాత్మకంగా వ్యవహరించి తన మిత్రపక్షాలకు సీట్ల సర్దుబాటులో కొంత వెసులుబాటు కల్పించి వారు బయటకు వెళ్లకుండా కట్టడి చేయడంలో విజయం సాధించారు. దీంతో ప్రస్తుతం విజయ్ రాజకీయ క్షేత్రంలో ఒంటరి పోరాటం చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది.రాష్ట్రంలోని ప్రధాన పార్టీలన్నీ డీఎంకే లేదా అన్నాడీఎంకే కూటముల్లో స్థిరపడటంతో టీవీకే భవిష్యత్తుపై భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. కేవలం పన్రుట్టి రామచంద్రన్ వంటి కొద్దిమంది మద్దతు తప్ప విజయ్‌కు బలమైన రాజకీయ అండ లభించలేదు. యువత , తొలిసారి ఓటు వేసే వారిపైనే ఆయన కొండంత ఆశలు పెట్టుకున్నారు. మరోవైపు విజయ్ వ్యక్తిగత జీవితం చుట్టూ ముసురుతున్న వివాదాలు కూడా ఆయన రాజకీయ ప్రతిష్టను దెబ్బతీసేలా కనిపిస్తున్నాయి. ఆయన భార్య సంగీత విడాకుల పిటిషన్ దాఖలు చేయడం , అందులో పేర్కొన్న అంశాలను ప్రత్యర్థి పార్టీలు ఇప్పటికే అస్త్రాలుగా మలుచుకుంటున్నాయి. ఎన్నికల సమయంలో ఈ వ్యక్తిగత ఆరోపణలు ఓటర్లపై ఎలాంటి ప్రభావం చూపుతాయో అన్నది ఇప్పుడు ఆసక్తికరంగా మారింది

## కేడర్ లో నిర్లిప్తత


**తిరుపతి – సూర్య వాస్తవం**

కూటమిలోని ప్రధాన పక్షమైన తెలుగుదేశం పార్టీలో క్రమ శిక్షణ అనేది నేడు కనిపించడం లేదు. గతంలో మాదిరిగా ఆ పార్టీ నేతలు ఉండటం లేదన్నది అందరికీ అర్థమయింది. పాత నీరు పోయి కొత్త నీరు వచ్చి చేరడంతోనే ఈ పరిస్థితులు ఏర్పడ్డాయని పలువురు సీనియర్ నేతలు సయితం ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. టిక్కెట్లను ఖరారు చేసే సమయంలోనే తగిన జాగ్రత్తలు తీసుకుని ఉంటే ఇప్పుడు ఈ ఇబ్బందులు తప్పేవి కదా? అన్న ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఒకటి కాదు..రెండు కాదు.. అనేక నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు ఇటువంటి పరిస్థితుల్లోనే ఉన్నారు. కానీ ఎవరిపైనా చర్యలు లేవు. అలాగే ఎవరిని పిలిచి గట్టిగా మందలించిన పాపాన పోలేదని పార్టీ కార్యకర్తలే సోషల్ మీడియాలో వ్యాఖ్యానిస్తున్నారు.తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు, విజయవాడ ఎంపీ కేశినేని చిన్ని, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి ప్రసాద్, గుంటూరు తూర్పు నియోజకవర్గం ఎమ్మెల్యే మహ్మద్ నజీర్ అహ్మద్ వంటి వారిపై అనేక ఆరోపణలు వచ్చాయి. వీరంతా కొత్త వారేనని గుర్తు చేస్తున్నారు. కొత్తగా ఎమ్మెల్యేలు టిక్కెట్లను పొంది గెలిచిన వారు మాత్రమే ఇలాంటి ఆరోపణలు ఎదుర్కొంటున్నారని, సీనియర్ నేతలు అందరూ వివాదాలకు దూరంగా ఉంటున్నారని చెబుతున్నారు. అలాంటి వారికి వచ్చే ఎన్నికల్లో టిక్కెట్ ఇవ్వకపోవచ్చు. కానీ ఈ మూడేళ్లలో పార్టీకి జరిగే డ్యామేజీ సంగతేంటని పలువురు తెలుగుదేశం పార్టీ అభిమానులు సోషల్ మీడియాలో ప్రశ్నిస్తున్నారు.మరొకవైపు పార్టీ క్యాడర్ నుంచి కూడా పలు ప్రశ్నలు సోషల్ మీడియా వేదికగా వినిపిస్తున్నాయి. పార్టీ ని పట్టించుకుంటారా లేదా లోకేశ్, చంద్రబాబు నాయుడు ఇలాంటి వి పదే పదే రీపీట్ అవటానికి కారణం మీరే నంటూ వేలు చూపుతున్నారు. ఈ రెండేళ్లలో చంద్రబాబు, లోకేశ్ లు కష్టపడి ఎన్ని కంపెనీలు ఆంధ్రప్రదేశ్ కు తెచ్చినప్పటికీ, ఉద్యోగాలను కల్పించినప్పటికీ, రోడ్లు ఎంత అభివృద్ధి చేసిన కూడా లోపం ఎక్కడ ఉంది.? కమ్యూనికేషన్ వ్యవస్థ బాగా లేదని వారు నిలదీస్తున్నారు. ఐఏఎస్, ఐపీఎస్ లు ఓట్లు వేయించరు,వాళ్ళ మాటలు విని మోసపోకండి మళ్ళీ మళ్ళీ అంటూ పోస్టులు పెడుతున్నారు. గ్రూప్ రాజకీయాలని కట్టడి చేయాలని, పార్టీ కోసం కొంత సమయం కేటాయించాలని కోరుతున్నారు. అలాగే టీడీపీ సోషల్ మీడియా కూడా పెద్దగా యాక్టివ్ గా లేదని, దానికి గ్లూకోజ్ ఇచ్చే ప్రయత్నం చేయాలని కోరుతున్నారు. సోషల్ మీడియా వారియర్స్ తో ఒక ఫోటో దిగేతే వారు యాక్టివ్ అవుతారని లోకేశ్, చంద్రబాబును కోరుతున్నారు. మరి చంద్రబాబు, లోకేశ్ ఏ రకంగా స్పందిస్తారన్నది చూడాలి.




- నిబంధనలకు విరుద్ధంగా కారుణ్య నియామకాల ఆరోపణలు
- నకిలీ ధ్రువపత్రాలతో ఉద్యోగాలు పొందినట్లు ఆరోపణలు

## డీసీహెచ్ఎస్ పరిధిలో నియామకాలపై అనుమానాలు.?



**అనంతపురం బ్యూరో–సూర్య వాస్తవం:**

అనంతపురం జిల్లా డిస్ట్రిక్ట్ కోఆర్డినేటర్ ఆఫ్ హాస్పిటల్ సర్వీసెస్ (డిసిహెచ్ఎస్)పరిధిలో జరిగిన ఉద్యోగ నియామకాలపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. జిల్లాలోని ప్రాంతీయ ఆసుపత్రులు, కమ్యూనిటీ హెల్త్ సెంటర్ కేంద్రాలలో కొంతమంది ఉద్యోగులు నిబంధనలకు విరుద్ధంగా నియమితులయ్యారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.కొందరు కారుణ్య నియామకాల పేరుతో, మరికొందరు నకిలీ ధ్రువీకరణ పత్రాల ద్వారా ఉద్యోగాలు పొందినట్లు సమాచారం.గత ఐదు సంవత్సరాలలో డీసీహెచ్ఎస్ పరిధిలో పలు నోటిఫికేషన్లు జారీ చేసి వందల సంఖ్యలో ఉద్యోగాలను భర్తీ చేసినట్లు తెలుస్తోంది. గత మూడు సంవత్సరాల్లోనే సుమారు 300కు పైగా పోస్టులు భర్తీ చేసినట్లు సమాచారం. వీటిలో ల్యాబ్ టెక్నీషియన్, ఫార్మసిస్ట్, ఈసీజీ టెక్నీషియన్, ప్లంబర్, ఎలక్ట్రిషియన్ తదితర పోస్టులు ఉన్నట్లు తెలిసింది.అయితే కొంతమంది అభ్యర్థులు ఇతర ప్రాంతాల్లో పనిచేసినట్లు నకిలీ అనుభవ ధ్రువపత్రాలు సమర్పించి ఉద్యోగాలు పొందినట్లు ఆరోపణలు ఉన్నాయి.

మరికొందరు నకిలీ విద్యార్హతలు, వికలాంగుల ధ్రువపత్రాలను ఉపయోగించి నియామకాలు పొందినట్లు సమాచారం. కారుణ్య నియామకాల విషయంలో కూడా నిబంధనలు పూర్తిగా పాటించలేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి.కారుణ్య నియామకాల సమయంలో జారీ చేసే నియమాలు, షరతులు పూర్తి చేయకపోయినా కొంతమంది ఉద్యోగులు సేవలో కొనసాగుతున్నట్లు ఆరోపణలు ఉన్నాయి.

కొందరు ఉద్యోగులు తప్పుడు ధ్రువీకరణలతో తమ సేవలను నిర్ధారించుకొని ఇంక్రిమెంట్లు, ప్రమోషన్లు మరియు ఇతర ప్రయోజనాలు పొందినట్లు సమాచారం.అలాగే గతంలో రోస్టర్ పాయింట్లు మార్చి ఉద్యోగాలు కల్పించారనే ఆరోపణలు కూడా వెలుగులోకి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ వ్యవహారంలో కొందరు కార్యాలయ సిబ్బంది కీలక పాత్ర పోషించారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి.ఈ నేపథ్యంలో అనంతపురం జిల్లాలో జరిగిన అన్ని నియామకాలపై సమగ్ర విచారణ జరిపి, నిబంధనలకు విరుద్ధంగా ఉద్యోగాలు పొందిన వారిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు మరియు ఉద్యోగ సంఘాలు కోరుతున్నాయి.

## స్పీకర్ పై అవిశ్వాసం......

**న్యూఢిల్లీ– సూర్య వాస్తవం**




దేశంలో ఎండలు ముదురుతున్నట్లే.. పార్లమెంట్ రెండో విడత బడ్జెట్ సమావేశాలు అధికార విపక్షాల మధ్య రాజకీయ వేడిని మరింత పెంచనున్నాయి. ఏప్రిల్ 2 వరకు జరిగే పార్లమెంట్ సమావేశాల్లో స్పీకర్ ఓం బిర్లాపై అవిశ్వాస తీర్మానం,బడ్జెట్ చర్చలు, డిమాండ్స్ ఫర్ గ్రాంట్స్, ఫైనాన్స్ బిల్లు సహా ఇతర బిల్లులపై చర్చలు జరగనున్నాయి. మొదటి విడతలో ఉభయ సభలను ఉద్దేశించి రాష్ట్రపతి ప్రసంగం, 2026–27 వార్షిక బడ్జెట్ ప్రవేశ పెట్టడం, రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మానంపై చర్చ, బడ్జెట్ ఆమోదం జరిగింది. తొలిసారి లోక్ సభలో రాష్ట్రపతి ప్రసంగానికి ధన్యవాద తీర్మా.. ప్రధాని ప్రసంగం లేకుండానే ఆమోదం పొందింది. భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందం,మాజీ ఆర్మీ చీఫ్ నారావణే ఫోర్ స్టార్స్ ఆఫ్ డెస్టినీ పుస్తక వివాదం, ప్రతిపక్ష నేతను మాట్లాడనీయకుండా స్పీకర్ అడ్డుకోవడం,లోక్ సభ నుంచి 8 మంది ఎంపీల సస్పెన్షన్, ప్రధాని మోదీ పై విపక్ష మహిళా ఎంపీల దాడి ఆరోపణలు, స్పీకర్ పై విపక్ష ఎంపీల అవిశ్వాస తీర్మానం తో తొలి విడత బడ్జెట్ సమావేశాలు ముగిశాయి. విపక్ష సభ్యులు ఇచ్చిన నోటీసు ప్రకారం.. కాంగ్రెస్ ఎంపీలు ముహమ్మద్ జావేద్, కె.సురేశ్, మల్లు రవి ముగ్గురు ఈ అవిశ్వాస తీర్మానాన్ని ప్రవేశపెట్టనున్నారు. స్పీకర్ ఓం బిర్లా పక్షపాత ధోరణి చూపుతున్నారని, నిష్పక్షపాతంగా వ్యవహరించడం లేదని విపక్ష ఎంపీలు ఆరోపిస్తున్నారు. లోక్‌సభలో ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీతో పాటు ఇతర విపక్ష నాయకులకు మాట్లాడే అవకాశం ఇవ్వడం లేదనీ, మహిళా విపక్ష ఎంపీలపై అనుచిత ఆరోపణలు చేశారనీ ప్రజా సమస్యలు లేవనెత్తినందుకు 8 మంది విపక్ష ఎంపీలను పూర్తి సమావేశానికి సస్పెండ్ చేశారనీ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. అయితే అధికార పార్టీ బీజేపీ,ఎన్‌డీఏ సభ్యులు మాజీ ప్రధాన మంత్రులపై అనుచిత వ్యాఖ్యలు చేసినా ఎలాంటి చర్య తీసుకోలేదని వివాదాస్పద విషయాల్లో బహిరంగంగా అధికార పార్టీకి మద్దతిచ్చారని విపక్షాలు మండిపడుతున్నాయి. స్పీకర్ రాజ్యాంగబద్ధంగా వ్యవహరించడం లేదని 118 మంది విపక్ష ఎంపీలు లోక్ సభ సెక్రటరీ జనరల్‌కి ఫిబ్రవరి 10 తేదీన అవిశ్వాస తీర్మానం ఇచ్చారు. తీర్మానంలో స్పీకర్ ఇకపై సభలో అన్ని పార్టీల నమ్మకాన్ని కోల్పోయారనీ స్పీకర్ పక్షపాత వైఖరి సభ్యుల హక్కులను దెబ్బతీస్తోందనీ సభ సాఫీగా నడవకుండా చేస్తోందనీ ఆరోపించారు..రాజ్యాంగం ఆర్టికల్ 94 సి ప్రకారం.. తీర్మానం ప్రవేశపెట్టడానికి కనీసం 50 మంది సభ్యులు నిలబడి మద్దతు తెలపాలి. దీనికి అనుగుణంగా అవిశ్వాస తీర్మానంపై చర్చ, ఓటింగ్ జరుగుతుంది. స్పీకర్ చర్చలో పాల్గొని ఓటు వేయవచ్చు కానీ అధ్యక్షత వహించలేరు. ఆయన అధికార పార్టీ సభ్యుల మధ్య కూర్చోవచ్చు. కానీ ఓం బిర్లా ఈ అవిశ్వాస తీర్మాన ప్రక్రియకు దూరంగా ఉంటున్నట్లు ప్రకటించారు. అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చిన తరువాత నిబంధనల ప్రకారం 14 రోజులకు సమయం పూర్తయినందున అవిశ్వాస తీర్మానం అంశాన్ని పార్లమెంట్ లిస్ట్ ఆఫ్ బిజినెస్ లో చేర్చారు. ఇప్పటికే బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మూడు రోజులపాటు పార్లమెంట్ సమావేశాలకు తప్పనిసరిగా హాజరుకావాలంటూ తమ ఎంపీలకు విప్ జారీ చేశాయి. అవిశ్వాస తీర్మానంపై చర్చకు 10 గంటలకు పైగా సమయం కేటాయించారు. స్పీకర్ తొలగింపు ప్రక్రియను ఆర్టికల్ 94సి లో స్పష్టంగా పొందుపరిచారు. దాని ప్రకారం అవిశ్వాస తీర్మానం సాధారణ మెజారిటీతో నెగ్గితే స్పీకర్ ఉద్వాసనకు గురవుతారు. అవిశ్వాస తీర్మానం కోసం నోటీసివ్వడంతో ఈ ప్రక్రియ మొదలవుతుంది. రాజ్యాంగ పదవులు, సంస్థలను అగౌరవపరచడంలో కాంగ్రెస్ పాత్రను హైలైట్ చేయాలని బీజేపీ, ఎన్డీఏ ఎంపీలు నిర్ణయించారు. స్పీకర్ ఏకపక్షంగా వ్యవహరించడం,ప్రతిపక్ష నేతను మాట్లాడనియకపోవడం,ఎంపీల సస్పెన్షన్,బిజెపి ఎంపీలకు అనుకూలంగా స్పీకర్ వ్యవహరించిన అంశాలను కాంగ్రెస్,విపక్ష ఎంపీలు లేవనెత్తనున్నారు.

స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం చర్చకు సభకు ప్యానెల్ స్పీకర్ అధ్యక్షత వహిస్తారు. అవిశ్వాస తీర్మానానికి కాంగ్రెస్, డీఎంకే,ఆర్జేడీ, వామపక్షాలు, శివసేన, ఎన్సీపీ, తృణమూల్ కాంగ్రెస్ స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానానికి మద్దతు ఇవ్వనున్నాయి. స్పీకర్ పై అవిశ్వాస తీర్మానం ఆమోదం పొందాలంటే లోక్ సభ సంఖ్యాబలంలో సభకు హాజరైన వారిలో సగానికి పైగా ఎంపీలు తీర్మానానికి మద్దతు తెలపాలి. అయితే ప్రస్తుతం ఎన్‌డీఏకు బలమైన మెజారిటీ ఉండటంతో తీర్మానం ఆమోదం పొందే అవకాశం లేదు. ఇటీవల కోటా ఎయిర్ పోర్టు శంకుస్థాపన సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ స్పీకర్ ఓం బిర్లాను అత్యంత నిష్పక్షపాతంగా, గౌరవప్రదంగా, సభను సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని ప్రశంసించారు.స్పీకర్‌పై ఇప్పటికే దాకా మూడుసార్లు అవిశ్వాస తీర్మానాలు పెట్టినా, రెండుసార్లు ఓటింగ్ దాకా వచ్చినా అవి వీగిపోయాయి. ఓటింగ్‌కు హాజరైన ఎంపీలలో సగానికంటే ఎక్కువ ఓట్లు అవిశ్వాసానికి వ్యతిరేకంగా ఉండటం వల్ల తీర్మానం వీగిపోయింది. గతంలో స్పీకర్లు జీవీ మౌలాంకర్ (1954), హుకుంసింగ్ (1966), బలరాం జాఖడ్ (1987)పై విపక్షాలు అవిశ్వాస తీర్మానాలిచ్చినా అవి వీగిపోయాయి.

స్పీకర్ పై అవిశ్వాస తీర్మానం పాస్ కావాలంటే రాజ్యాంగం ఆర్టికల్ 94(ఇ) ప్రకారం సభలో హాజరైన, ఓటు వేసిన సభ్యులలో సాధారణ మెజారిటీ సగానికంటే ఎక్కువ అవసరం. అంటే అవిశ్వాస తీర్మానం ఆమోదం పొందాలంటే 273 మంది మద్దతు అవసరం ప్రస్తుతం ఇండియా బ్లాక్ మొత్తం బలం సుమారు 234 సీట్లు విపక్షాలు అన్నీ ఓటు వేసినా మెజారిటీని దాటలేవు దీంతో తీర్మానం వీగిపోయే అవకాశమే ఎక్కువ. అధికార ఎన్‌డీఏ బలం సుమారు 293 సీట్లుగా ఉంది. దీనికి తోడు ఎన్డీఏ లో లేని పార్టీలు వైసీపీ, శిరోమణి అకాలీదళ్, స్వతంత్ర ఎంపీల మద్దతు కలిస్తే అధికార పక్షం బలం 300 పై మార్కుకు చేరుతుంది. ఎన్‌డీఏకు బలమైన సంఖ్యాబలం ఉండటంతో స్పీకర్ ఓం బిర్లా ఆయన స్థానంలో కొనసాగే అవకాశమే ఎక్కువగా ఉంది

# భూమికి సర్వహక్కుదారు మీరే

**- పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీ కార్యక్రమంలో ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు**



**రాయదుర్గం– సూర్య వాస్తవం :** ప్రతి రైతుకు తన సొంత పొలంపై సర్వ హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం పట్టాదారు పాస్ పుస్తకాలను జారీ చేస్తోందని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు వెల్లడించారు. అందులో భూ యజమాని ఫోటో, ప్రభుత్వ రాజముద్ర మినహా ఇంకెవరి ఫోటోలు ముద్రించనందున తమ భూములు ఇంకెవరో స్వాధీనం చేసుకుంటారన్న అభద్రతా భావం అవసరంలేదని స్పష్టం చేశారు. రాయదుర్గం రూరల్ బాగినాయకనహల్లి లో సోమ వారం నిర్వహించిన "మీ భూమి మీ హక్కు" కార్యక్రమం లో రైతులకు ఆయన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... చంద్ర బాబు నాయుడు ముఖ్యమంత్రి అయిన తర్వాత రాజ ముద్రతో కూడుకున్న వివాద రహితమైన పాస్ పుస్తకాలను ప్రతి రైతుకు అందించడం జరుగుతోందన్నారు. అందులో ఉన్న హాలో గ్రామ్ సాయంతో మీ సెల్ ఫోన్‌లో ఎప్పుడైనా మీ భూమి వివరాలు సులువుగా తెలుసు కోవడం వీలవుతుందన్నారు. మీకు మీరుగా మీ భూమి అమ్మితే మినహా... అందులో ఇతరులు ఎలాంటి చేర్పులు, మార్పులు చేయటానికి కుదరదన్నారు. ఏళ్ల తరబడి మన అనుభవంలో ఉంటూ మన పెద్దలు సాగుచేసిన భూముల కూడా కొన్ని ప్రాంతాల్లో సంబంధం లేని వ్యక్తుల పేర్లతో ఉంటున్నాయన్నారు. అలాంటప్పుడు ఆ భూమి మాదేనని రికార్డుల ప్రకారం నిరూపించుకునే అవకాశం లభించద న్నారు. ఇలాంటి సమస్యలన్నింటికీ ఏకైక పరిష్కార మార్గం నేడు కూటమి ప్రభుత్వం మీకు అందిస్తున్న రాజముద్రతో కూడిన పట్టాదార్ పుస్తకాలేనని తెలియజేశారు. ఆ భూమిపై మీకు సర్వహక్కులు, అధికారాలు ఉన్నాయని తెలియ జేయడానికి ఈ



పుస్తకం ఓ బలమైన ఆయుధం లాంటిది. ప్రభుత్వం ఇచ్చే పంట నష్ట పరిహారం లభించాలన్న, సబ్సిడీ విత్తనాలు కావాలన్నా, లేదా బ్యాంకుల నుండి రుణాలు పొందాలన్న ఈ పాసు పుస్తకం ఏకైక ఆధారమన్నారు. జాయింట్ ఎల్పీ నెంబర్లు ఉన్న రైతులు వాటిని సరిచేయించుకుని మీ భూమి సర్వే నెంబర్, విస్తీర్ణం, సరిహద్దు తదితర వివరాలు పూర్తిస్థాయిలో పట్టాదారు పాసు పుస్తకంలో ఉండేలా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆయా సీజన్లలో రైతులు సాగు చేసే పంట, విస్తీర్ణం తప్పక సంబంధిత రైతు సేవ కేంద్రాల్లో తప్పక నమోదు చేయించుకోవాలని సూచించారు. తద్వారా ఏదైనా విపత్కర పరిస్థితుల్లో పంట నష్టం వాటిలితే రైతులకు ప్రభుత్వం ద్వారా లేదా బీమా కంపెనీల ద్వారా ఆర్థిక సహాయం పొందే హక్కు లభిస్తుందన్నారు. పట్టాదారు పాస్ పుస్తకం రైతు పేరు మీదనే ఉన్నప్పటికీ పంట నమోదు వివరాలు రైతు సేవా కేంద్రాల ద్వారా తెలియజేయకపోతే నష్టం వాటిల్లినా ప్రభుత్వం నుంచి ఎలాంటి సహాయం అందదని ఎమ్మెల్యే కాలవ గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు కురుబ హనుమంతు, కాటా వెంకటేశులు, సర్పంచ్ రాజశేజర్ రెడ్డి, తిమ్మారెడ్డి, సోము, వన్నూరుస్వామి తదితరులు పాల్గొన్నారు.

## కస్తూర్బాల్లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

**- సమగ్ర శిక్ష ఏపీసీ శైలజ**



**అనంతపురం– సూర్య వాస్తవం:** జిల్లాలోని కస్తూర్భాగాంధీ బాలికా విద్యాలయా (కేజీబీవీ)ల్లో 2026–27 విద్యా సంవత్స రానికి సంబంధించి ప్రవేశాలకు నోటిఫికేషన్ జారీ అయిందని సమగ్ర శిక్ష అదనపు పథక సమన్వయకర్త టి.శైలజ సోమవారం తెలిపారు. ఈ నెల 12 నుంచి ఏప్రిల్ ఒకటో వరకు దరఖాస్తు చేసుకోవచ్చని వెల్ల డించారు. ప్రతి కేజీబీవీల్లో 6వ తరగతికి 40 సీట్లు, ఇంటర్ మొదటి సంవత్సరంలో 40 సీట్లకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు వివరించారు. 7, 8, 9, 10 తరగతి వరకు, ఇంటర్ రెండో సంవత్సరంలో ప్రస్తుతం ఖాళీ ఉన్న సీట్ల భర్తీకి ఏప్రిల్ ఒకటి వరకు దరఖాస్తులు ఆన్లైన్ ద్వారా స్వీకరించనున్నట్లు తెలిపారు. ఆఫ్ లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించేది లేదని స్పష్టం చేశారు. https://apkgbv.apcfss.in వెబ్ సైట్ ద్వారా మాత్రమే అప్లికేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని ఆమె ప్రకటించారు. ఇలా ఆన్లైన్ ద్వారా వచ్చిన దరఖా స్తులు మాత్రమే అడ్మిషన్ కొరకు పరిగణనలోకి తీసుకుంటామన్నారు. ఎంపికైన విద్యార్థుల జాబితా ఏప్రిల్ 13న విడుదల చేస్తామని వెల్లడించారు. ఏప్రిల్ 13 నుంచి 17 వరకు సంబంధిత కస్తూర్భాగాంధీ బాలికా విద్యాలయాలలో విద్యార్థినుల ధ్రువపత్రాలను పరిశీలించి, తరగతుల వారీగా సీట్లు కేటాయిస్థామన్నారు.

## ఓపెన్ స్కూల్ విద్యార్థులకు నేటి నుంచి హాల్ టిక్కెట్లు జారీ

**అనంతపురం– సూర్య వాస్తవం:** ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం ఆధ్వర్యంలో ఈ నెల 18 నుంచి ప్రారంభం కానున్న ఓపెన్ స్కూల్ పరీక్షలకు సంబంధించి అభ్యర్థులు మంగళవారం నుంచి హాల్ టిక్కెట్లు సంబంధిత స్టడీ సెంటర్ల నుంచి పొందవచ్చని డీఈఓ కడవ ప్రసాద్ బాబు సోమవారం తెలిపారు. ఓపెన్ స్కూల్ పరీక్షలు రాయనున్న విద్యార్థులకు సంబందించిన హాల్ టిక్కెట్లు నేరుగా లేదా వాట్సప్ - మనమిత్ర ద్వారా విద్యార్థులు డౌన్లోడ్ చేసుకోవచ్చని డీఈఓ వివరించారు. అభ్యర్థులు సెల్: 3552800009 నంబరుకు హాయ్ అనే సందేశాన్ని పంపాలని తెలిపారు. చూస్ సర్వీస్ లేదా సేవను ఎంచుకోండి అనే ఆప్షన్పై క్లిక్ చేస్తే ఎడ్యుకేషన్ సర్వీసెస్ లేదా 'విద్యా సేవలు'ను ఎంచుకోవాలి. తర్వాత ఏపీ ఓపెన్ స్కూల్ ఎస్సెస్సీ పబ్లిక్ ఎగ్జామినేషన్, మార్చి-2028 హాల్ టిక్కెట్స్ అనే ఆప్షన్పై క్లిక్ చేయాలి. తరువాత విద్యార్థి అడ్మిషన్ నంబర్, పుట్టిన తేదీని నమోదు చేసి, హాల్ టిక్కెట్ డౌన్లోడ్ చేసుకోవడానికి కన్ఫర్మ్ అనే దానిపై క్లిక్ చేయాలి. డౌన్లోడ్ చేసుకున్న హాల్ టిక్కెట్లో వివరాలు సరిగా ఉన్నాయో లేదా సరిచూసుకోవాల్సి ఉంటుంది. హాల్ టిక్కెట్లు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం వారి అధికారిక వెబ్సైట్ https://www.apopenschool.ap.gov.in చూడాలన్నారు.

**పదో తరగతి పరీక్షల ఏర్పాట్లపై నేడు శిక్షణ**

ఈ నెల 16 నుంచి ప్రారంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలపై అనంతపురంలోని ఆర్ట్స్ కళాశాలలో ఎంఈఓ - 1, 2, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంట్ ఆఫీసర్లకు ఒక రోజు శిక్షణ మంగళవారం నిర్వహించనున్నట్లు డీఈఓ కడప ప్రసాద్ బాబు సోమవారం తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి శిక్షణ కార్యక్రమం మొదలవుతుందని, పైన పేర్కొన్న క్యాడర్ల అధికారులు తప్పక హాజరు కావాలని ఆదేశించారు.

## అరటి రైతులను ఆదుకోవాలి

**- జిల్లా కలెక్టర్‌కు రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి తరిమెల వంశీ గోకుల్ రెడ్డి వినతి**



**శింగనమల– సూర్య వాస్తవం :** శింగనమల నియోజకవర్గంలోని ఆయా మండలాల్లో అరటి సాగు చేసి నష్టపోయిన రైతులను ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలని రాష్ట్ర రైతు విభాగం కార్యదర్శి తరిమెల వంశీ గోకుల్ రెడ్డి, వైసీపీ సంయుక్త కార్యదర్శి బండ్లపల్లి ప్రతాప్ రెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం జిల్లా కలెక్టర్ ఆనంద్‌ను కలిసి వారు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నియోజకవర్గంలోని రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. పంట నష్టం: అకాల వర్షాలు, గాలివానల వల్ల అరటి తోటలు దెబ్బతిన్నాయని, పెట్టుబడి కూడా రాక రైతులు అప్పుల పాలవుతున్నారని తెలిపారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి నష్టాన్ని అంచనా వేయాలని, అర్హులైన ప్రతి రైతుకు నష్టపరిహారం చెల్లించాలని కోరారు.మార్కెట్‌లో అరటి గెలలకు గిట్టుబాటు ధర లభించేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యలపై సానుకూలంగా స్పందించిన కలెక్టర్ సంబంధిత అధికారులతో మాట్లాడి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నీలం భాస్కర్, పప్పూరు మధు రెడ్డి, మదిరేపల్లి మధు రెడ్డి, సర్పంచ్ రామాంజనేయులు, శింగనమల నియోజకవర్గ పరిధిలోని పలు మండలాలకు చెందిన రైతులు పాల్గొన్నారు.

## కల్వర్టులోకి దూసుకెళ్లిన కారు

**ఉరవకొండ - సూర్య వాస్తవం:** అనంతపురం–బళ్లారి ప్రధాన రహదారిపై కూడేరు మండలం బ్రాహ్మణపల్లి గ్రామం వద్ద కారు అదుపుతప్పి కల్వర్టులోకి దూసుకెళ్లింది. ఈ ఘటనలో బెంగళూరుకు చెందిన సవిత, తను, భరత్‌లకు గాయాలయ్యాయి. వీరు ఉరవకొండ దైవదర్శనం కోసం వెళ్లి తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. గాయపడిన వారిని స్థానికులు 108 అంబులెన్స్‌లో అనంతపురం ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. ప్రమాద కారణాలు ఇంకా తెలియరాలేదు.



## క్యాన్సర్ వైద్య సేవలకు సాయం

**- ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు**



**రాయదుర్గం - సూర్య వాస్తవం:** క్యాన్సర్ నిర్ధారణ పరీక్షల తర్వాత వ్యాధి లక్షణాలు ఉన్న వారికి అవసరమైన వైద్య సేవల్లో తమవంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు హామీ ఇచ్చారు. రాయదుర్గం పట్టణంలోని శ్రీ సీతా రామాంజనేయస్వామి కళ్యాణమండటంలో బసవతారకం స్మారక క్యాన్సర్ ఆసుపత్రి సౌజన్యంతో సోమవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు నిర్వహింపజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, క్యాన్సర్ వ్యాధి ఒకరికి వచ్చినా ఆ కుటుంబం మొత్తాన్ని తీవ్ర ఆవేదనకు గురి చేస్తుందన్నారు. తన తల్లికి క్యాన్సర్ వ్యాధి శోకటంతో ఆ బాధ ఎలా ఉంటుందో తనకు తెలుసన్నారు. అలాంటి ఇబ్బందులున్న కొందరికైనా తమవంతు సహకారం అందించాలన్న ఉద్దేశంతో ఉచిత క్యాన్సర్ వ్యాధి నిర్ధారణ పరీక్షలు చేయిస్తున్నట్లు తెలిపారు. వెనుకబడ్డ రాయదుర్గం లాంటి ప్రాంతాల్లో అత్యాధునిక వైద్య సౌకర్యాలు అందుబాటులో లేవన్నారు. వైద్య సేవల కోసం హైదరాబాద్, విజయవాడ, బెంగళూరు లాంటి సుదూర ప్రాంతాలకు వెళ్లి రావడం ఇక్కడి ప్రజలకు ఎంతో వ్యయ ప్రయాసలతో కూడుకున్నదన్నారు. అందువల్లే ప్రజల సౌకర్యార్థం బసవతారకం స్మారక క్యాన్సర్ వైద్యశాల సహకారంతో రాయదుర్గం పట్టణంలో నిర్ధారణ పరీక్షల కోసం ఉచిత శిబిరం నిర్వహించడం జరుగుతూ ఉందన్నారు. వ్యాధి లక్షణాలున్న వారు ఎవరైనా ముఖ్యంగా మహిళలు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరచుకోవా లన్నారు. అనుభవజ్ఞులైన వైద్యులు నిర్ధారణ పరీక్షలు చేస్తున్నారన్నారు. ఈ పరీక్షల్లో ఎవరికైనా క్యాన్సర్ వ్యాధి ఉన్నట్లు నిర్ధారణ జరిగితే, వారికి తదుపరి వైద్య సేవలకు అవసరమైన సహాయం కల్పిస్తామన్నారు. ప్రజలు ఇలాంటి అవకాశాలను సద్వినియోగపరచుకోవాలని ఎమ్మెల్యే సూచించారు.

## ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవు

**- సీఐ నరసింహులు**

**వేంపల్లె - సూర్య వాస్తవం:** ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించేలా బోర్డులను రోడ్డుపై పెడితే అలాంటి దుకాణాదారులపై కఠిన చర్యలు తప్పవని వేంపల్లె సీఐ నరసింహులు తెలిపారు. ఈ సందర్భంగా వేంపల్లెలో ట్రాఫిక్ పై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామన్నారు. వేంపల్లెల్లోని ఆర్టీసీ బస్టాండ్ నుండి నాలుగు రోడ్ల కూడలి వరకు ట్రాఫిక్ పై పర్యవేక్షించారు. అంతరాయం కలిగిస్తూ రోడ్లపై పెట్టిన బోర్డులను తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ డ్రైనేజీ కాలువ లోపలేకే దుకాణదారులు బోర్డులు పెట్టుకోవాలని సూచించారు. రోడ్లపై బోర్డులు,బైకులు అడ్డంగా పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.దుకాణాల వద్ద మోటర్ బైకులు కూడ క్రమ పద్ధతిలో రాకపోకలకు అంతరాయం కలగకుండా పార్కింగ్ చేసుకోవాలన్నారు. రోడ్డు పనులు జరుగుతున్నాయాని కాబట్టి ప్రజలు అందరూ సహకరించాలని కోరారు. అడ్డదిడ్డంగా మోటర్ బైకులు, ఎక్కడ పడితే అక్కడ పెద్ద వాహనాలు పార్కింగ్ చేసి ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించవద్దని హెచ్చరించారు.





## అన్నదానంతో వేలాదిమంది ఆకలి తీర్చిన గడ్డం గంగి నాయుడు

**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం :** అన్నదానం నిర్వహించి వేలాదిమంది ఆకలి తీర్చిన గడ్డం గంగి నాయుడు మరియు వారి కుటుంబ సభ్యులను పత్రా కులస్తులు అభినందనలతో ముంచెత్తుతున్నారు.పత్రా నాయుళ్ల అన్నదాన సధనం మరియు కళ్యాణ మండపం ప్రారంభోత్సవానికై ఆంధ్ర ప్రదేశ్, కర్ణాటక, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాల నుంచి వేలాదిమంది పత్రా కులస్తులు బ్రహ్మంగారిమఠం తరలి రావడం జరిగింది. వచ్చిన వేలాదిమంది పత్రా కులస్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించిన ఖాజీపేట మండలం, డాన్ ఖాన్ పల్లెకు చెందిన గడ్డం రామయ్య,గడ్డం జయమ్మ కుమారులైన గడ్డం గంగి నాయుడు,గడ్డం రామచంద్ర వీరి కుటుంబ సభ్యులు కలిసి రెండు రోజులపాటు రుచికరమైన టిఫిను, భోజన కార్యక్రమం నిర్వహించడం పై వీరి ఉదార స్వభావానికి పత్రా కులస్తులు ఎంతో మంత్రముగ్ధుల య్యారు. అదే కాకుండా మఠం ఐదు రోడ్ల కూడలి నుంచి వేలాదిమంది పత్రాకు లస్తులంతా ర్యాలీగా రావడం జరిగింది. ఈ ర్యాలీ మిట్ట మధ్యాహ్నం కావడంతో పత్రా కులస్తులకు ఎక్కడ ఇబ్బంది పడకుండా ఉండాలని ఉద్దేశంతో మజ్జిగ, త్రాగునీళ్లు ర్యాలీ వెంబడి ఒక వాహనంలో గంగి నాయుడు ఏర్పాటు చేయడం ఎంతో గొప్ప విషయమని వచ్చిన పత్రా కులస్తులు అభినందించారు. అలాగే ఇంత పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేసిన వీరి ఉదార స్వభా వానికి పత్రా కులస్తులందరూ హర్షిస్తున్నారు. అన్నదాత సుఖీభవ అన్న పెద్దల సూక్తిని మన పత్రా కులస్తులందరూ కూడా వీరికి సుఖీభవ అనవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని పలువురు ప్రశంసించారు. వీరికి వీరి కుటుంబానికి శ్రీ వీరబ్రహ్మేంద్రస్వామి ఆయు రారోగ్య అష్టైశ్వర్య భోగభాగ్యములు కల్పించి మరెన్నో అన్నదాన కార్యక్రమాలు చేసే విధంగా శక్తిని ప్రసాదించాలని పత్రా కులస్తులంతా కోరుకుంటున్నారు.

## వైసీపీ గ్రామ జనరల్ సెక్రెటరీగా ఎన్నికైన కె.నవీన్



**పత్తికొండ టౌన్ - సూర్య వాస్తవం:** వైఎస్సార్‌సీపీ గ్రామ, మండల, జిల్లా స్థాయిల్లో పార్టీని బలోపేతం చేసేందుకు, ప్రజా సమస్యలపై పోరాడేందుకు చురుకైన నాయ కులను జనరల్ సెక్రటరీలుగా నియమిస్తోంది. ఇటీవల కాలంలో పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా, అలాగే జిల్లా స్థాయిలో అనేక కొత్త నియామకాలు చేపట్టింది. అందులో భాగంగా పత్తికొండకు చెందిన కె.నవీన్ గ్రామ జనరల్ సెక్రటరీగా నియమితుల య్యారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడుతూ....పార్టీ అభివృద్ధి కోసం, గ్రామీణ స్థాయిలో ప్రజల సమస్యల పరిష్కారం కోసం పనిచేస్తానన్నారు. గ్రామస్థాయి నుండి పార్టీని బలోపేతం చేసి రాబోయే రోజుల్లో మన ప్రియతమ నాయకుడు వైయస్ జగన్మోహన్ రెడ్డిని ముఖ్యమంత్రిగా చేస్తామని తెలిపారు

# దక్షిణ భారత పవర్‌లిఫ్టింగ్‌లో
# రజత పతకం సాధించిన ఉపాధ్యాయుడు



**వేంపల్లె - సూర్య వాస్తవం :** వేంపల్లి పట్టణంలోని శ్రీనివాస హైస్కూల్‌లో ఫిజిక్స్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న బాబురావు దక్షిణ భారత స్థాయి పవర్‌లిఫ్టింగ్ పోటీలలో రజత పతకాన్ని సాధించారు. ఈ పోటీలు మార్చి 7, 8 తేదీలలో బెంగళూరు లో నిర్వహించగా, 59 కిలోల బరువు విభాగంలో పాల్గొన్న ఆయన అద్భుత ప్రతిభ కనబరిచారు. ఈ పోటీలలో బాబురావు స్క్వాట్‌లో 212.5 కిలోలు, బెంచ్ ప్రెస్‌లో 90 కిలోలు, డెడ్‌లిఫ్ట్‌లో 185 కిలోలు ఎత్తి మొత్తం 487.5 కిలోల బరువుతో ద్వితీయ స్థానాన్ని దక్కించుకుని రజత పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఈ విభాగంలో కేరళకు చెందిన క్రీడాకారుడు మొదటి స్థానాన్ని సాధించారు. ఈ సందర్భంగా బాబురావు మాట్లాడుతూ తన లక్ష్యాన్ని సాధించడంలో నిరంతరం ప్రోత్సహించి సహ కరించిన డా. బాల గోవింద్ తివారికి కృతజ్ఞతలు తెలిపారు. ఆయన సహకారం వల్లనే నేను ఈ విజయాన్ని సాధించ గలిగాను. ఆరోగ్యం ప్రతి ఒక్కరికీ చాలా అవసరం. వ్యాయామం ద్వారా శారీరక, మానసిక దృఢత్వం లభిస్తుంది. కడప జిల్లాలోని పిల్లలు, యువతలో ఎంతో ప్రతిభ ఉంది. ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో వెయిట్‌లిఫ్టింగ్, బాడీబిల్డింగ్, రెజ్లింగ్ వంటి క్రీడలకు ఫిట్‌నెస్ అకాడమీలు ఏర్పాటు చేస్తే అనేక మంది విద్యార్థులు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో కడప జిల్లాకు కీర్తి తీసుకురాగలరు. భవిష్యత్తులో వారికి ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు కూడా లభిస్తాయి అని తెలిపారు. ఈ సందర్భంగా డా. బాల గోవింద్ తివారి మాట్లాడుతూ... శక్తివంతమైన దేశం కావాలంటే శక్తివం తమైన ప్రజలు అవసరం. శారీరక వ్యాయా మాలు, ముఖ్యంగా బరువులు ఎత్తే క్రీడల ద్వారా దేహ దృఢత్వం పెరుగుతుంది. ప్రతి భారతీయుడు తన ఆరోగ్యంపై శ్రద్ధ పెట్టాలన్నారు. పాఠశాల ప్రతినిధి కేసవులు మాట్లాడుతూ దృఢసంకల్పం, పట్టుదలతో బాబురావు ఈ విజయాన్ని సాధించారు. ఆయన ప్రతిభపై మాకు ఎంతో గర్వంగా ఉంది. భవిష్యత్తులో జరిగే పోటీల్లో కూడా మరిన్ని విజయాలు సాధించాలని కోరుకుంటున్నాము. విద్యార్థులంతా ఆయనను ఆదర్శంగా తీసుకోవాలి అని తెలిపారు. పాఠశాలలోని సహచర ఉపాధ్యాయులు కూడా బాబురావును అభినందిస్తూ హర్షం వ్యక్తం చేశారు.

## యోగి వేమన విశ్వవిద్యాలయ సెమిస్టర్ పరీక్షలలో ప్రతిభ

### - ప్రిన్సిపాల్ నాగేంద్ర



**వేంపల్లె - సూర్య వాస్తవం :** వైయస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో వివిధ కోర్సులు చదువుతున్న విద్యార్థులు యోగి వేమన విశ్వవిద్యాలయ సెమిస్టర్ ఫలితాలలో అత్యధిక స్కోర్ సాధించారని కళాశాల ప్రిన్సిపల్ నాగేంద్ర తెలిపారు. ఈ సందర్భంగా వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ సతీష్ మాట్లాడుతూ 3వ సంవత్సరం చదువుతున్న

1. పి. లక్ష్మీదేవి (బిఎస్సికెమిస్ట్రీ) - 10/10
2. బి. కుసుమ (కంప్యూటర్ సైన్స్) - 9.83/10
3. ఎన్. చందన (బీకాం కంప్యూటర్స్) -9.13/10
4. ఎస్. బి. ఆయేషా ( బీఎస్సీ మ్యాథమెటిక్స్) -9.38/10
5. ఎం. శైలజ (బి.ఎ. హిస్టరీ) - 9.0/10

**2వ సంవత్సరం చదువుతున్న**

1. సి. భువనేశ్వరి ( బీకాం కంప్యూటర్స్)-9.05/10
2. ఎస్. రేష్మ (బి.ఎ. హిస్టరీ) - 8.80/10
3. జె. చందన (బిఎస్సి మ్యాథమెటిక్స్) -9.70/10
4. జి. జోష్న (బిఎస్సీ మ్యాథమెటిక్స్)-9.30/10
5. ఎస్. బీబీ సహారా(బిఎస్సీ కంప్యూటర్ సైన్స్) - 8.60/10, ఉన్నత శ్రేణిలో ప్రతిభ కనబరిచారని కళాశాలలోని సంబంధించిన డిపార్ట్మెంట్ హెచ్.ఓ.డిలు విద్యార్థులకు మూమెంట్స్ ని బహుకరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు డాక్టర్ బాలకొండ గంగాధర్, డాక్టర్ సుధాకర్, డాక్టర్ శ్రీకాంత్ రెడ్డి, డాక్టర్ రామకృష్ణ, డాక్టర్ ఓబుల్ రెడ్డి, డాక్టర్ మల్లేశ్వరమ్మ, కిరణ్‌మై, షఫీవుద్దీన్, రాజారెడ్డి, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

## అసంపూర్తిగా ఉన్న స్కూల్ భవనాలను పూర్తి చేయండి

**వేంపల్లె - సూర్య వాస్తవం :** సోమవారం కడపలో కలెక్టర్ ఆఫీస్‌లో జేసీని కలిసి వేంపల్లిలో తలిశెట్టి సుబ్రహ్మణ్యం బాయ్స్ హైస్కూల్‌లో అసంపూర్తిగా ఉన్న రెండు భవనాలను పూర్తి చేయమని కోరారు. దాదాపు రెండు సంవత్సరాల నుంచి అసంపూర్తిగా ఉన్న ఈ భవనాలను నిధులను మంజూరు చేసి పూర్తి చేయించి విద్యార్థుల యొక్క ఇబ్బందులను తీర్చవలసిందిగా జేసీని స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ ఎస్ఎండి షబ్బీర్ ఒక వినతి పత్రాన్ని ఇచ్చి నిధులను మంజూరు చేయమని కోరారు. జెసి ని కలిసిన వారిలో వేంపల్లి మండలం తెలుగు యువత ఉపాధ్యక్షుడు గంగాధర్ రెడ్డి, అల్తాఫ్ (తాళ్లపల్లి), బాబు, భాష. పాల్గొన్నారు.



## చట్ట వ్యతిరేక శక్తులను అరికట్టడంలో సీతయ్య

### - అర్బన్ సీఐగా రామయ్య (శ్రీరామ్)



**పులివెందుల అర్బన్ - సూర్య వాస్తవం :** జిల్లావ్యాప్తంగా ఇటీవల జరిగినటువంటి పోలీసుల సాధారణ బదిలీలలో భాగంగా పులివెందుల అర్బన్ సీఐగా శ్రీరామ్ సోమ వారం బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో చట్ట వ్యతిరేక శక్తులను అరికట్టడంలో తన వంతు పాత్ర పోషించి మరో సీతయ్య కాగలరంటూ ప్రజలు ఆశా భావం వ్యక్తం చేస్తున్నారు. సోమ వారం పులివెందుల అర్బన్ స్టేషన్లో అర్బన్ సీఐగా శ్రీరామ్ బాధ్యతలు స్వీకరించి అనంతరం డిఎస్పి మురళి నాయక్ తో మర్యాదపూర్వకంగా కలవగా డిఎస్పి మురళి నాయక్ ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. 2007 లో ముదిగుబ్బ ట్రైనీ ఎస్సైగా బాధ్యతలు స్వీకరించి విధి నిర్వహణలో నిజాయితీతో నిక్కచ్చిగా వ్యవహరించి తదనంతరం కందుకూరు, పుట్టపర్తి, రాయదుర్గం, కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం, కదిరి, ధర్మవరం ప్రాంతాలలో ఎస్సైగా విధులు అదేవిధంగా అనంతపురం, హిందూపురం, మడకశిర, ధోని కర్నూల్, కాళహస్తి, ప్రొద్దుటూరులలో సిఐగా విధులు నిర్వహించి నేడు బదిలీలలో భాగంగా పులివెందుల అర్బన్ సీఐగా బాధ్యతలు చేపట్టారు. ఏది ఏమైనప్పటికీ శ్రీరామ్ తన విధి నిర్వహణలో ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా తన విధులను నిర్వహించి మంచి పేరు తెచ్చుకోగా ముఖ్యంగా అసాంఘిక శక్తులను నియంత్రించడానికి ఆయన చేసే ప్రయత్నాలు ప్రజలలో ఆయనకున్న ఇమేజ్ పెరగడంలో ఎలాంటి అతిశయోక్తి లేదని, రౌడీలకు కౌన్సిలింగ్, మద్యం షాపులు మరియు మట్కా జూదాలపై కఠిన ఆంక్షలు విధించి అమలు చేయడంలో, సామాన్య ప్రజలకు పోలీసు సేవలను దగ్గర చేయడంలో, లా అండ్ ఆర్డర్ నిర్వహణలో తమ సిబ్బందిని సమన్వయ పరచుకోవడంలో శ్రీరామ్ విశేష కృషి చేశారని అలాంటి తరుణంలో రాష్ట్రంలోనే ప్రత్యేకత సాధించుకున్న పులివెందులలో తన సహజ శైలికి అనుగుణంగా ప్రవర్తించి అసాంఘిక శక్తుల అక్రమా లను అరికట్టడంలో, ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడంలో ఏ మేరకు సఫలీకృతుడు అవుతాడో ప్రజలు వేచి చూస్తున్నారు, ఏది ఏమైనప్పటికీ శ్రీరామ్ తన విధి నిర్వహణలో మరింత రాణించాలని ప్రజలు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.

## లింగ నిర్ధారిత వీర్యం ద్వారా కృత్రిమ గర్భధారణ

### - సహాయ సంచాలకులు

### ప్రాంతీయ పశువైద్యశాల : డాక్టర్ రత్నకుమార్



**శింగనమల - సూర్య వాస్తవం :** డాక్టర్ రత్నకుమార్ మాట్లాడుతూ రాష్ట ప్రభుత్వం ఇటీవల ప్రవేశ పెట్టిన లింగ నిర్ధారిత వీర్యం ద్వారా కృత్రిమ గర్భధారణ చేయటం వలన 90శాతం ఆడ దూడలు మాత్రమే పుడతాయి. సాధారణంగా ఈ వీర్యం ఒక్కో డోస్ ఖరీదు రూ.650 కాగా రాష్ట్రంలోని ఇతర అన్ని జిల్లాలలో సబ్సిడీ మీద రూ.150 నుండి రూ.250శాతం వరకు ఇస్తుండగా రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆధ్వర్యంలో మన అనంతపురం జిల్లాలో మాత్రం ఉచితంగా ఇవ్వటం జరుగు తుంద న్నారు. ఈ వీర్యం ద్వారా పుట్టిన పెయ్యదూడలు మంచి ఆరోగ్యకరంగా ఉండటమే కాక మంచి పాల దిగుబడి ఇచ్చే పాడి పశువులుగా వృద్ధి చెందుతాయన్నారు. రైతు సేవాకేంద్రాల్లో పనిచేస్తున్న పశు వైద్య సహాయకుల శిక్షణలో భాగంగా దండువారిపల్లిలో పనిచేయుచున్న పశు వైద్య సహాయకురాలు తేజస్వినికి శిక్షణ ఇవ్వటం జరుగుతున్నది. రైతు సోదరులు వారి పశువులు యెదకు వచ్చినప్పుడు బుక్కరాయ సముద్రంలోని ప్రాంతీయ పశు వైద్యశాలలో ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ప్రాంతీయ పశు వైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ రత్నకుమార్ తెలియజేశారు.

## మిట్టమల్లేశ్వరునికి విశేష పూజలు



**పులివెందుల - సూర్యవాస్తవం :** పులివెందుల పట్టణంలోని గుంత బజార్ సమీపంలో ఉన్న ఎంతో పురాతన మైన ప్రసిద్ధి గాంచిన శ్రీ మిట్ట మల్లేశ్వర స్వామి ఆలయంలో సోమ వారాన్ని పురస్కరించుకొని శ్రీ మిట్టమల్లేశ్వరుని విశేష పూజలు నిర్వ హించారు. ఈ కార్యక్రమాల్లో భా గంగా తెల్లవారు జామున నుండి స్వామి వారికి ప్రధాన అర్చకులు రుద్ర, శివ స్వాముల ఆధ్వ ర్యంలో స్వావి ివారికి పంచా మృత అభిషేకం, భస్మాభిషేకం, సహస్ర నామ అష్టోత్తర శతనామావళి, భీష్మాభిషేకం, లింగాష్టకం తదితర పూజా కైకర్యాల అనంతరం మిట్ట మల్లేశ్వరుడు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు మాట్లాడుతూ శివాలయంలో ప్రతిరోజు విశేష పూజలు ధూప, దీప, నైవేద్యాలు, ఘనం గా నిర్వహించడం జరుగుతోందన్నారు. సోమవారాన్ని పురస్కరించుకొని ఆలయానికి పెద్దసంఖ్యలో భక్తులు పాల్గొని పరమ శివునికి ఎంతో నమ్మకంతో భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించి విశేష పూజలు నిర్వహించడం జరుగుతుందన్నారు. అనంతరం అనంతరం ఆలయ నిర్వా హకులు ఏర్పాటుచేసిన తీర్థ ప్రసాదాలను భక్తులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో భక్తులు ఎండోమెంట్ సిబ్బంది, ఆలయ నిర్వహకులు, తదితరులు పాల్గొన్నారు.

## సిఐ శ్రీరామ్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన హ్యూమన్ రైట్స్ సభ్యులు



**పులివెందుల - సూర్య వాస్తవం :** పులివెందుల అర్బన్ సీఐగా బాధ్యతలు చేపట్టిన శ్రీరామ్‌ని తన కార్యాలయంలో సోమవారం హ్యూమన్ రైట్స్ ఫర్ జస్టిస్, కడప జిల్లా వైస్ ప్రెసిడెంట్ మునియాదవ్, పులివెందుల టౌన్ ప్రెసిడెంట్ మునివర్ధన్ మర్యాద పూర్వకంగా కలిశారు. అనంతరం శాల్వాతో సత్కరించి, శుభాకాంక్షలు తెలిపారు.

## అవోపా యూనిట్ అమ్మవారిశాలలో మహిళా దినోత్సవ వేడుకలు






**పులివెందుల - సూర్య వాస్తవం :** పులివెందుల అవోపా యూనిట్ అమ్మవారి శాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని నిర్వహించింది. వాటిలో భాగంగా ఆదివారం పులివెందులలోని శ్రీవాసవి కన్యకా పం మేశ్వరి దేవస్థానంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా బండారు ముని లావణ్య నామ నాగలక్ష్మి సగళ పావని దొంతు గంగా లక్ష్మి మహిళా మండలి సభ్యులకు సన్మాన కార్యక్రమం ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో పులివెందుల ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు దేసు శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు మేడా రమణయ్య, రాష్ట్ర అవోపా ప్రాంతీయ కార్యదర్శి మేడ సాయి బాబా, జిల్లా ఉపాధ్యక్షుడు మేడమ్ దినేష్ కుమార్, జిల్లా అవోపా సభ్యులు రాజోలి సుబ్రహ్మణ్యం, సత్య సుబ్రహ్మణ్యం, తల్లం సురేంద్రనాథ్, పులివెందుల అవోపా అధ్యక్షులు దొంతు మురళీమోహన్ ఉపాధ్యక్షులు పెనుజూరు రమేష్, కార్యదర్శి కేశవ, కోశాధికారి, నామ జనార్ధన్ వాసవి క్లబ్ అధ్యక్షుడు మాలేపాటి హరి బాబు, ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలు మేడా సుబ్బరత్నమ్మ, ఇతర సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## అవోపా ఆధ్వర్యంలో ఘన సన్మానం

### - సమాజానికి ఆదర్శం మహిళలే

**వేంపల్లె - సూర్య వాస్తవం :** స్థానిక అవోపా ఆధ్వర్యంలో పలువురు మహిళలకు ఘనంగా సన్మానించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని నందిపల్లి సర్పంచ్ మారం సులోచనమ్మ, అక్షర కళాశాల కరస్పాండెంట్ భూమిరెడ్డి విజయభారతి, ఆర్యవైశ్య మహిళా విభాగం అధ్యక్షురాలు బచ్చు భాగేశ్వరమ్మలను శాలువ కప్పి ఘనంగా సత్కరించారు. అనంతరం అవోపా అధ్యక్షుడు బైరిశెట్టి సునీల్ కుమార్ మాట్లాడుతూ సమాజానికి మహిళలే ఆదర్శమన్నారు. మహిళా సాధికారత, సమానత్వంపై అవగాహన కల్పించారు. మహిళలు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని, తమ శక్తిని, ప్రతిభను గుర్తించి మరింత చైతన్యవంతం కావాలని కోరారు. ఈ కార్యక్రమంలో అవోపా కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.





# సేవ్ ఆర్డీటి నినాదంతో దద్దరిల్లిన ఉరవకొండ

**- మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో మహాధర్నా**




**ఉరవకొండ – సూర్య వాస్తవం:** అనంతపురం జిల్లా ఉరవకొండ నియోజకవర్గం స్థానిక వైసీపీ కార్యాలయం నుండి ఎమ్మార్వో ఆఫీస్ వరకు ఆర్డీటి రక్షించుకుందాం అనే పేరుతో ర్యాలీ నిర్వహించారు. అఖిలపక్ష కమిటీ నాయకుల స్థానిక ఎమ్మార్వో ఆఫీస్ నందు మహాధర్నా కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ వైసీపీ ఇంచార్జ్ వై విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ ఆర్డీటి అనేది కేవలం ఒక సమస్త కాదు, అదొక జీవనాడి.సామాజిక భద్రత మరియు మద్దతు ఆర్డీటి దశాబ్దాలుగా వెనుకబడిన వర్గాలకు, ముఖ్యంగా దళితులు, గిరిజనులకు అండగా నిలుస్తుంది. వేలాది మంది పేదలకి పక్క ఇల్లు నిర్మించి ఇచ్చింది. సమాజంలో అణిచివేతకు గురైన వారికి తమ హక్కుల పట్ల అవగాహన కల్పించి ఆత్మ విశ్వాసాన్ని నింపింది. సామాన్య ప్రజలుకు వైద్యం అందుబాటులోకి తీసుకొచ్చింది. అని అన్నారు. ఈ సమస్యపై కూటమి ప్రభుత్వం (ఎఫ్ సి ఆర్ ఏ )పై నిర్ణయం త్వరగా తీసుకోకుంటే జిల్లా వ్యాప్తంగా ధర్నా ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అలాగే కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు వై మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ ఆర్డీటి ఆసుపత్రులు (బత్తలపల్లి వంటివి) అత్యున్నత ప్రమాణాలతో కూడిన వైద్య సేవలను అతి తక్కువ ధరకే అందిస్తుంది. నిరుపేద విద్యార్థుల కోసం పాఠశాలలు, వసతి గృహాలు అనంతపురం వంటి కరువు ప్రాంతాల్లో చెక్ డ్యామ్‌ల నిర్మాణం, భూగర్భ జలాల పెంపు, రైతుల కోసం వినూత్న వ్యవసాయ పద్ధతులను ప్రవేశపెట్టారు. వెంటనే కూటమి ప్రభుత్వం ఎఫ్‌సిఆర్‌ఏని వెంటనే పునరుద్ధరణ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ వైసిపి యూత్ అధ్యక్షుడు ప్రణయ్ రెడ్డి, జడ్పీటిసి త్రిలోకనాథ్ రెడ్డి,మరియు మండల అధ్యక్షులు కార్యకర్తలు కాంగ్రెస్ సిపిఐ, సిపిఎం అధ్యక్షులు మరియు కార్యకర్తలు. సామాన్య ప్రజలు, విద్యార్థులు పాల్గొన్నారు.




## మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు
## ముమ్మరంగా వాహనాలు తనిఖీ

**- ట్రాఫిక్ సీఐ శాంతి లాల్**



**పులివెందుల – సూర్య వాస్తవం :** తల్లిదండ్రులు తమ మైనర్ పిల్లలకు వాహనాలు ఇవ్వ వద్దని పులివెందుల ట్రాఫిక్ సిఐ సూచిస్తూ పూలంగళ్ళ సర్కిల్ వద్ద, ట్రాఫిక్ సీఐ శాంతి లాల్ తన సిబ్బందితో వాహనాలు తనిఖీలు నిర్వహించారు. ఈ కార్య క్రమంలో భాగంగా సోమవారం స్పెషల్ డ్రైవ్‌లో పట్టుబడ్డ మైనర్లు, వారి తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ చేశారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ సిఐ మాట్లాడుతూ మైనర్లకు వాహనాలు ఇస్తే తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామని హెచ్చ రించారు. రహ దారి భద్రతలో భాగంగా స్పెషల్ డ్రైవ్ చేపట్టి ప్రమాదాలను నియంత్రించడమే లక్షమని తెలియజేస్తూ వాహనదారుల వద్ద రికార్డులు లేనివారికి జరిమానాలు విధిస్తూ, ప్రతి వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని, అతివేగం ప్రమాదకరమని, ట్రాఫిక్ నియమ నిబంధనలు పాటించినప్పుడే ప్రమాదాలు నియంత్రించ వచ్చునని పలు సూచనలు సలహాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది శివ, లక్ష్మిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు .

## మదర్ థెరీసా జాతీయ సర్వీస్ అవార్డు
## చెక్కభజన గురువు బొప్పా ఈశ్వర్ గౌడ్

**కడప – సూర్య వాస్తవం:** మదర్ థెరీసా జాతీయ సర్వీస్ గ్లోబల్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మార్కాపురం పట్టణంలో గోల సత్యనారాయణ కమిటీ హాల్‌లో ముఖ్యఅతిథిగా పి.వి.పి అంజనీ కుమారి సి.ఎస్సి కోర్టు సీనియర్ సూపర్నెంట్ చేతుల మీదుగా ఈ అవార్డును చెక్కభజన గురువు బొప్పా ఈశ్వర్ గౌడ్ కు అందజేశారు నంద్యాల జిల్లా సిరివెళ్ల మండలం గుండంపాడు గ్రామం గ్రామానికి చెందిన బొప్పా వెంకటసుబ్బమ్మ, బాలనాగన్న దంపతులకు ముగురు సంతానం సంతానం అందులో మొదటి సంతానం బొప్పా ఈశ్వర్ గౌడ్ చిన్నతనంలో నుండి కళా రంగాలలో ఎంతో ఇష్టమైన గ్రామీణ ప్రాంతాలలో ప్రాచీనమైన కళ చెక్కభజన, జడకోపు, కోలాటం రంగాలలో నేర్చుకోవాలని ఆసక్తితో కడప జిల్లా చెక్కభజన గాన కోకిల గురువు నాయన పల్లి ఓబులేసు దగ్గర 2003 సంవత్సరంలో చెక్కభజనను నేర్చుకున్నారు 2005 నుండి చెక్కభజన గురువుగా ఎదిగి చాలా గ్రామాలలో, పట్టణ ప్రాంతాలలో, తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో చెక్కభజన కళా రంగాలలో మంచి గుర్తింపు పొందిన గురువుగా మదర్ థెరీసా జాతీయ సర్వీస్ ఫౌండేషన్ వారు చెక్క భజన గురువు బొప్పా ఈశ్వర్ గౌడ్‌కు అవార్డును అందజేశారు. చెక్క భజన గురువు బొప్పా ఈశ్వర్ గౌడ్ మాట్లాడుతూ మదర్ థెరీసా జాతీయ సర్వీస్ గ్లోబల్ హెల్ప్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నాకు ఈ అవార్డు రావడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. చెక్క భజన గురువు బొప్పా ఈశ్వర్ గౌడ్‌కు అవార్డు రావడంతో గుండంపాడు గ్రామ ప్రజలు, పెద్దలు, బంధువులు ఆనందం వ్యక్తం చేశారు.



## ఏపీ ఫుడ్ కమిషనర్ ఆకస్మిక తనిఖీ







**శాంతిపురం – సూర్య వాస్తవం:** ఏపీ ఫుడ్ కమిషనర్ విజయప్రతాప్ రెడ్డి శాంతిపురం మండలంలోని పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించి, మెనూ ప్రకారం పోషకాహారం మరియు నాణ్యమైన భోజనం అందించాలని అధికారులకు సూచనలు చేశారు. శాంతిపురం ప్రభుత్వ ఉన్నత పాఠశాల,కొండపల్లి వద్ద ఉన్న ఏపీ బాలయోగి గురుకులం, కేజీబీవీ, తుమ్మిశి వద్ద ఉన్న ఏపీ మోడల్ స్కూల్, బడుగుమాకులపల్లి ఎంపిపిఎస్ పాఠశాలలను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు, ప్రిన్సిపాల్స్, హెడ్‌మాస్టర్లు పాల్గొన్నారు. విద్యార్థుల ఆరోగ్యం, పోషకాహారం పట్ల ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతుందని తెలిపారు.

## ముఖ్యమంత్రికి స్వాగతం పలికిన సీడ్స్ చైర్మన్, డీసీఎంఎస్ చైర్మన్



**డోన్ – సూర్య వాస్తవం:** ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు డోన్ పర్యటనలో భాగంగా డోన్ మండలం, కొత్తబురుజు గ్రామానికి విచ్చేసిన సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సీడ్స్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం మన్నె సుబ్బారెడ్డి, ఉమ్మడి కర్నూలు జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ నాగేశ్వరరావు యాదవ్ ఇరువురు కలిసి హెలిప్యాడ్ వద్ద స్వాగతం పలికారు. అనంతరం మీ భూమి – మీ హక్కు రైతులకు రాజముద్రతో కూడిన పట్టాదారు పాస్ పుస్తకాలు పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## కావూరి సాంబశివరావుకు శ్రద్ధాంజలి ఘటించిన తులసి రెడ్డి

**వేంపల్లె – సూర్య వాస్తవం :** మాజీ కేంద్ర మంత్రి మాజీ పార్లమెంటు సభ్యులు శ్రీకావూరి సాంబశివరావు మృతి పట్ల రాజ్యసభ మాజీ సభ్యులు కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి విచారం వ్యక్తం చేశారు. స్వర్గీయ సాంబశివరావు ప్రజా సమస్యలపై మంచి అవగాహన ఉన్న నాయకుడని, స్నేహశీలి అని తులసి రెడ్డి కొనియాడారు. మూడు సార్లు మచిలీపట్నం లోక్సభ సభ్యుడిగా, రెండుసార్లు ఏలూరు లోక్సభ సభ్యుడిగా ఎన్నికయ్యారన్నారు.స్వర్గీయ సాంబశివరావు పవిత్ర ఆత్మకు పరమేశ్వరుడు ప్రశాంతిని ప్రసాదించాలని ప్రార్థించారు. ఆయన కుటుంబ సభ్యులకు ప్రగాఢ సంతాప సానుభూతి తెలియజేశారు.

## నూతన సీఐ శ్రీరామ్‌ను కలిసిన తెలుగుయువత ప్రధాన కార్యదర్శి



**పులివెందుల – సూర్య వాస్తవం :** పులివెందుల అర్బన్ సిఐగా తమ విధులను లా అండ్ ఆర్డర్ అంటూ సింహంలా గర్జించ డానికి వచ్చిన శ్రీరామ్‌ని పులివెందుల అర్బన్ పోలీస్ స్టేషన్లో సోమవారం కడప పార్లమెంట్ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి అక్కులుగారి విజయ్ కుమార్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికి దృశ్యాలతో సత్కరించారు. ఈ సందర్భంగా సిఐతో విజయ్ ముచ్చటించారు. అనంతరం సిఐ శ్రీరామ్ మాట్లాడుతూ ప్రజలకు పోలీసు సేవలు అందించడం, శాంతిభద్రతలను కాపాడటం పోలీసుల ముఖ్య ఉద్దేశ్యం అని, ప్రజా భద్రత, నేరాల నివారణ, న్యాయ అమలు, మరియు పౌరుల ఆస్తుల రక్షణ ద్వారా ప్రజలకు సేవ చేయడమే నిజమైన లా అండ్ ఆర్డర్, ఇది సమాజంలో ప్రశాంతతను, చట్టబద్ధమైన పరిపాలనను నిర్ధారిస్తుందని పులివెందుల ప్రజల సహకారంతో ప్రజా సేవే లక్ష్యంగా అందుబాటులో ఉంటారని తెలిపారు.

## గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీ హర్షణీయం

**- ప్రిన్సిపాల్ నాగేంద్ర**



**వేంపల్లె – సూర్య వాస్తవం :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు పౌష్టికాహారం పంపిణీ హర్షణీయమని ప్రిన్సిపాల్ ఎస్.నాగేంద్ర అన్నారు. సోమవారం స్థానిక అంగన్వాడీ కేంద్రంలో కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఏర్పాటు చేసిన పౌష్టికాహారాన్ని గర్భిణీ స్త్రీలకు పంపిణీ చేశారు. సమాజంలో పురోగతి సాధించేందుకు, ఇలాంటి కార్య క్రమాలు స్ఫూర్తిదాయకమని ప్రిన్సిపాల్ వెల్లడించారు. అలాగే ఎన్ఎస్ఎస్ అధికారి డా.ఓబుల్ రెడ్డి మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యంలో గర్భిణీ స్త్రీలకు అవసరమైన పౌష్టికాహారాన్ని అందించినట్లు తెలిపారు. వైస్ ప్రిన్సిపాల్ డా.సతీష్, అధ్యాపకులు కిరణ్మయి, షఫివుద్దీన్, సిహెచ్‌ఓలు దేవి, శైలజ, సూపర్వైజర్ మధు, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## కాటమరాయుడి సేవలో దేవళం శీనా బ్రదర్స్

**- శీన అన్నదమ్ములను అభినందించిన జిల్లా ఎస్పీ**

**శ్రీ సత్య సాయి బ్యూరో – సూర్య వాస్తవం:** కదిరి పట్టణం శివాలయం ప్రాంతానికి చెందిన దేవళం శీన ఇతని అన్న నర సింహులు ఇద్దరు ప్రతి సంవత్సరం కదిరి పట్టణంలో జరిగే కదిరి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో ముందుంటారు. కదిరి తిరునాళ్ళు వస్తున్నాయని తెలియగానే వీళ్ళ దృష్టి ఎంత ప్రధానంగా తేరుపైనే ఉంటుంది. శ్రీవారి బ్రహ్మ రథోత్సవం(తేరు)రోజు ఖాద్రీ నరసింహస్వామి ఆలయ తిరువీధులలో తేరు పైనుంచి భక్తులకు దర్శనమిస్తారు. అందువల్ల తేరు రథచక్రాలు సరిగా ఉన్నాయా లేదా అని ప్రతి సంవత్సరం వాటిని చూసి మరమ్మత్తులు చేయడం జరుగుతుంది . అందులో భాగంగానే గత నాలుగు రోజుల నుంచి శ్రీనివాసులు నరసింహులు అని ఇద్దరు అన్నదమ్ములు మరి కొంతమంది సహాయంతో తేరు రథచక్రాలను మరమ్మతులు చేస్తున్నారు. అంతేకాకుండా బ్రహ్మ రథోత్సవం తేరు జరిగే రోజు ప్రారంభం నుండి ఆఖరి వరకు రథచక్రాలకు తెడ్లు వేస్తూ నరసింహస్వామి సేవలో కొనసాగుతూ ఉంటారు అందువల్ల తాజాగా శనివారం జిల్లా ఎస్పీ సతీష్ కుమార్ ఆలయ ఉప కమిషనర్ మరియు కార్య నిర్వహణ అధికారి వెండిదండి శ్రీనివాసరెడ్డి డి.ఎస్.పి శివన్నారాయణ స్వామి ఆధ్వర్యంలో రథచక్రాలను పరిశీలించారు ఆ సమయంలో ఎస్పీ రథచక్రాలకు సంబంధించిన మరమ్మత్తు వివరాలను అడిగినప్పుడు అధికారులు అక్కడే ఉన్న శ్రీనివాసులు నరసింహులు అన్నదమ్ములు ఇద్దరినీ ఎస్పీకి పరిచయం చేశారు ప్రధానంగా శ్రీనివాసులు గురించి చెప్పడంతో ఎస్పీ అతనిని అభినందించారు రథోత్సవం విజయవంతం కావడానికి మీరు కృషి చేయాలని భుజం తట్టి అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు చేయడం మంచిదని వారిని అభినందించారు.



# ఉగాది నుంచి మరింత సందడి




ఉగాది పండక్కి ఈసారి టాలీవుడ్‌లో ఉస్తాద్ భగత్‌సింగ్, దురందర్ 2 విడుదల కానున్నాయి. యశ్ సినిమా టాక్సిక్ విడుదల వాయిదా పడింది. ఫిబ్రవరి మందకొడిగా సాగిన బాక్సాఫీస్‌కు యశ్ 'టాక్సిక్', రణవీర్ సింగ్ 'ధురందర్ 2' మధ్య పోటీ ఉంటుందని అందరూ భావించారు. టాక్సిక్ వాయిదా పడటంతో టాలీవుడ్‌లో 'ఉస్తాద్ భగత్ సింగ్' విడుదలకు సిద్ధమైంది. వీటితో పాటు చిన్న సినిమాలు కూడా వరుసగా వస్తుండటంతో థియేటర్లకు మళ్లీ పండగ వాతావరణం రానుంది. వేసవి సీజన్ అనగానే తెలుగు సినీ పరిశ్రమకు గోల్డెన్‌ఛాన్స్ లాంటిది. కుటుంబాలతో కలిసి థియేటర్లకు వెళ్లే ప్రేక్షకుల సంఖ్య పెరిగే ఈ కాలంలో నిర్మాతలు, హీరోలు తమ భారీ చిత్రాలను విడుదల చేయడానికి ఆసక్తి చూపుతారు. జనవరిలో పెద్ద సినిమాల హడావుడి కనిపించి నప్పటికీ, ఫిబ్రవరి నెల బాక్సాఫీస్ పరంగా కొంత మందకొడిగా సాగింది. ఇప్పుడు సినీ పరిశ్రమ ఆశలన్నీ మార్చి నెలపైనే ఉన్నాయి. వేసవికి తొలి నెలగా భావించే మార్చిలో చిన్న, భారీ చిత్రాలు విడుదలకు సిద్ధమవుతుండటంతో సినీ ప్రియుల్లో మంచి ఉత్సాహం కనిపిస్తోంది.

ఈనెల మొదటి శుక్రవారం ఆరు చిన్న, మధ్యతరహా సినిమాలు విడుదలయ్యాయి. విష్ణు కథానాయకుడిగా నటించిన ఇన్వెస్టిగేటివ్ థ్రిల్లర్ చిత్రం 'మృత్యుంజరు' మూవీ, లావణ్య త్రిపాఠి ప్రధాన పాత్రలో తెరకెక్కిన 'సతీ లీలావతి', శివాజీ, లయ ప్రధాన పాత్రల్లో నటించిన 'సాంప్రదాయని సుప్పిని సుద్దపూసని' సినిమాలు విడుదలై కొద్దిపాటి ఆదరణను పొందాయి. హర్షరోషన్, శ్రీదేవి కలిసి నటించిన 'బ్యాండ్ మేళం' సినిమా 13 నుంచి 26వ తేదీకి మారింది. 19న బాలీవుడ్ స్టార్ రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో ఆదిత్య ధర్ తెరకెక్కించిన 'ధురందర్ 2' కూడా విడుదల కానుంది.

**టాలీవుడ్‌లో ఉస్తాద్ భగత్‌సింగ్ ఒక్కటే...**

ఈసారి వేసవికి థియేటర్లు కళకళలాడ నున్నాయి. ఒకప్పటిలా సినిమాలు బాక్సాఫీస్ ముందుకు వరుస కట్టనున్నాయి. దర్శకనిర్మాతలు తమ సినిమాల విడుదల తేదీల్ని ఖరారు చేస్తున్నారు. ఈసారి కూడా మార్చిలోనే రావాల్సిన 'పెద్ది', 'ది ప్యారడైజ్' సినిమాల విడుదల ప్రణాళికలు మారిపోయాయి. ఉగాదికి పవన్‌కళ్యాణ్ 'ఉస్తాద్ భగత్‌సింగ్' విడుదల తేదీని ఖరారు చేసుకుంది. ఆ వెంటనే 'పెద్ది' కొత్త తేదీ వచ్చేసింది. శర్వానంద్ 'బైకర్'తోపాటు చాలా సినిమాలు విడుదలకు సిద్ధమయ్యాయి. కన్నడ నటుడు యశ్ కథానాయకుడిగా నటించిన 'టాక్సిక్' ఈనెల 19న విడుదల కావాల్సివుంది. ఏవో సాంకేతిక కారణాలతో ఈ సినిమా విడుదల వాయిదా పడింది. 'కెజిఎఫ్?' చిత్రాల తర్వాత ఆయన కథానాయకుడిగా నటించిన ఈ చిత్రంపై పాన్ ఇండియా స్థాయిలో అంచనాలు ఉన్నాయి. తెలుగులోనూ ఈ చిత్రం భారీ స్థాయిలో విడుదలవుతోంది. పవన్ కళ్యాణ్ 'ఉస్తాద్ భగత్‌సింగ్' సినిమా వాస్తవంగా ఈనెల 26న విడుదలకు సిద్ధమైంది. ఎందుకంటే టాక్సిక్ 19న ఉన్నందున నిర్మాతలు 26కు మార్చారు. ఇప్పుడు టాక్సిక్ రేసులో లేకపోవటంతో ఆ స్థానంలోకి ఇప్పుడు ఉస్తాద్ భగత్‌సింగ్ సినిమా చేరిపోయింది. శ్రీలీల, రాశీ ఖన్నా కథానాయికలు. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ నిర్మించింది. మార్చి 19నే రావాల్సిన 'పెద్ది' నెలలకుపైగా గ్యాప్‌తో ఏప్రిల్ 30న విడుదల కానుంది. బుచ్చిబాబు సానా దర్శకత్వంలో రూపొందిన చిత్రమిది. పాన్ ఇండియా స్థాయిలో ముస్తాబవుతున్న ఈ చిత్రంపై భారీ అంచనాలున్నాయి. అగ్ర కథానాయకుల చిత్రాల విడుదల ఎప్పుడనేది పక్కాగా తేలితే, అందుకు అనుగుణంగా మిగతా సినిమాలు విడుదల తేదీల్ని ఖరారు చేసుకుంటాయి. పవన్‌కల్యాణ్, రామ్‌చరణ్ సినిమాలపై స్పష్టత రావడంతో, మిగిలిన సినిమాలూ విడుదల తేదీల్ని ఖరారు చేసుకొంటున్నాయి. శర్వానంద్ కథానాయకుడిగా నటించిన 'బైకర్' ఏప్రిల్ 3న విడుదల కానుంది. ఇందులో సీనియర్ హీరో రాజశేఖర్ ముఖ్యపాత్రని పోషించారు. అభిలాష్ కంకర దర్శకత్వం వహించారు. యు.వి.క్రియేషన్స్ నిర్మిస్తోంది. 'రాకాస' చిత్రం 3నే రానుంది. నిఖిల్ కథానాయకుడిగా నటించిన 'స్వయంభూ' ఏప్రిల్ 10వ తేదీన విడుదల కానుంది. ఈ నెల 11న ఈ సినిమా టీజర్‌ని విడుదల చేయనున్నారు. అడివి శేష్ కథానాయకుడిగా నటించిన 'డెకాయిట్' కూడా విడుదలకు సిద్ధమైంది.

**మరిన్ని చిత్రాలు సిద్ధం**

సూర్య -- వెంకీ అట్లూరి చిత్రంతోపాటు, వరుణ్‌తేజ్ 'కొరియన్ కనకరాజు', అఖిల్ అక్కినేని కథానాయకుడిగా నటిస్తున్న 'లెనిన్', బెల్లంకొండ శ్రీనివాస్ 'టైసన్ నాయుడు', సాయిదుర్గా తేజ్ 'సంబరాల ఏటిగట్టు' సహా చాలా సినిమాలపై స్పష్టత రావాలి. మార్చిలోనే రావాలనుకున్న నాని 'ది ప్యారడైజ్' కొత్త విడుదల తేదీ ఎప్పుడనేది కూడా తేలాల్సి ఉంది. అగ్ర కథానాయకుడు చిరంజీవి నటించిన 'విశ్వంభర' జులై 10న వస్తుందని సమాచారం. ఆల్కహాల్ వీసా... ఇలా చాలా సినిమాలే ఈ వేసవిలో విడుదలకు ముస్తాబవుతున్నాయి. త్వరలోనే ఆయా సినిమాల రాకపై స్పష్టత వచ్చే అవకాశాలున్నాయి.

**పరీక్షల కాలం:** ప్రస్తుతం పరీక్షల కాలం నడుస్తోంది. విద్యార్థినీ విద్యార్థులను సకాలంలో కేంద్రాలకు చేర్చే పనిలోనూ, వారిని పరీక్షలకు ప్రిపేర్ చేయించే యజ్ఞంలో తల్లిదండ్రులు ఉంటున్నారు. ఈ నేపథ్యంలో పరీక్షల తరువాత దాదాపు మూడు నెలలపాటు కొనసాగే వేసవి సీజన్‌ని దృష్టిలో పెట్టుకుని పదుల సంఖ్యలో సినిమాలు ముస్తాబవుతున్నాయి. ఈ వేసవిలో ఏయే సినిమాలు అలరిస్తాయో వేచిచూడాల్సిందే.



# తదుపరి లక్ష్యం 2028 ఒలింపిక్స్



## - స్వర్ణ పతకం సాధించి చరిత్ర సృష్టిస్తాం
## - కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్

**అహ్మదాబాద్:** టి20 ప్రపంచకప్‌ను కైవసం చేసుకున్న ఆనందంలో ఆరోజు రాత్రంగా ఆటగాళ్లంతా నిద్రపోలేదని, తమ జట్టు తదుపరి లక్ష్యం ఒలింపిక్స్‌లో స్వర్ణ పతకం సాధించడమేనని కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ వెల్లడించాడు. సోమవారం ఉదయం జరిగిన మీడియా సమావేశంలో సూర్యకుమార్ మాట్లాడుతూ... ట్రోఫీ, మెడల్స్ అందుకొని తామంతా రూమ్‌లకు వెళ్లేసరికే అర్ధరాత్రి అయ్యిందని, ఆ తర్వాత కూడా ఎవ్వరూ నిద్రపోలేదని, రాత్రంతా ఫైనల్లో సాధించిన విజయం పట్ల, మాట్లాడుకుంటూనే ఉన్నారని తెలిపాడు. విజయం తర్వాత, రాత్రి పొద్దుపోయే వరకు వేడుకలు కొనసాగాయని, ఆటగాళ్లకు చాలా తక్కువ నిద్ర పట్టిందన్నాడు అలాగే తదుపరి ఆశయాన్ని వివరిస్తూ... ఒలింపిక్స్‌లో బంగారు పతకాన్ని సాధించడం ఇప్పుడు తమ ముందున్న కర్తవ్యమని, ప్రపంచకప్ విజయం గతంలోకి వెళ్లిపోయిందన్నాడు. ఏ ఐసిసి ఈవెంట్‌లు వచ్చినా, తాము అదే బ్రాండ్ క్రికెట్‌ను ఆడతామని, 2024 తర్వాత ఆటగాళ్ల శైలిని మార్చుకున్నారని, ట్రోఫీ కైవసం చేసుకోవడంతో జట్టు రిలాక్స్‌గా ఉందన్నాడు. అలాగే 2028లో అతిపెద్ద ఈవెంట్ ఉందని, అది ఒలింపిక్స్ అని, క్రికెట్‌ను ఆ ఒలింపిక్స్‌లో తొలిసారి ప్రవేశపెడు క్రమంలో ఒలింపిక్ స్వర్ణం ఖచ్చితంగా కొడతామని తెలిపాడు. అదే ఏడాది టి20 ప్రపంచకప్ ఆడాల్సి ఉందని, దీంతో వరుసగా రెండుసార్లు టైటిల్స్ కొట్టిన సంఖ్యను మూడుకు ఎందుకు పెంచకూడదు" అని వెల్లడించాడు.

**దిగ్గజాల సరసన సూర్యకుమార్..**

టి20 ప్రపంచకప్‌ను సాధించిన టీమిండియా కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ దిగ్గజాల సరసన తన పేరును లిఖించుకున్నాడు. ఐసిసి ట్రోఫీని మన దేశానికి అందించిన కపిల్ దేవ్, మహేంద్రసింగ్ ధోని, రోహిత్ శర్మ మరియు హర్మన్‌ప్రీత్ కౌర్ తర్వాత టి20 ట్రోఫీని టీమిండియాకు అందించిన ఐదో భారత కెప్టెన్ సూర్యకుమార్ నిలిచాడు. 1983లో హర్యానా హరికేన్ కపిల్‌దేవ్ టీమిండియాకు తొలిసారి ఐసిసి వన్డే ప్రపంచకప్ టైటిల్‌ను అందించిన ఆటగాడిగా చరిత్రపుటల్లో నిలిచాడు.

ఆ తర్వాత 20ఏళ్లకు 2007లో మహేంద్ర సింగ్ ధోనీ సారథ్యంలోని భారతజట్టు తొలి టి20 ప్రపంచకప్‌ను కైవసం చేసుకుంది. అనంతరం 2024లో రోహిత్ శర్మ 17ఏళ్ల తర్వాత మరోసారి ఈ టైటిల్‌ను టీమిండియాకు అందించి సుదీర్ఘ విరామానికి తెర దించాడు. ఈ ఏడాది రెండు ఐసిసి ట్రోఫీలు భారత్‌ను వరించాయి. తొలుత 2026లో మహిళల వన్డే ప్రపంచకప్‌ను హర్మన్‌ప్రీత్ కౌర్ అందించి రికార్డుపుటల్లోకెక్కగా.. తాజాగా టి20 ప్రపంచకప్‌ను సూర్యకుమార్ యాదవ్ సారథ్యంలో భారతజట్టు గెలిచింది.

**ద్రావిడ్, లక్ష్మణ్‌లకు అంకితం: కోచ్ గౌతం గంభీర్**

టి20 ప్రపంచకప్‌కు ముందు గౌతమ్ గంభీర్ కోచింగ్‌పై పలు విమర్శలు వచ్చినా.. ఏ మాత్రం తన వ్యూహాన్ని మార్చలేదు. అభిషేక్ లాంటి బ్యాటర్‌కు మళ్లీ మళ్లీ అవకాశాలు కల్పిస్తూ వచ్చాడు. కీలక దశలో మాత్రమే జట్టులో మార్పు చేశాడు. 'మ్యాన్ ఆఫ్ ది సిరీస్' కైవసం చేసుకున్న సంజూ శాంసన్‌ను సరైన సమయంలో తుది జట్టుకు ఎంపిక చేశాడు. లీగ్ దశలో కొన్ని మ్యాచుల్లో విఫలమై సంజును కీలక మ్యాచుల్లో చోటు కల్పించి పటిష్టంగా తీర్చిదిద్దాడు. ఈ సందర్భంగా గంభీర్ మాట్లాడుతూ.. వరల్డ్‌కప్‌ను ఇద్దరు మాజీ క్రికెటర్లకు అంకితం ఇస్తున్నట్లు వెల్లడించాడు. సోషల్ మీడియా కామెంట్లు చేసే వారిని తాను పట్టించుకోనని, టైటిల్ సాధించడంలో 30మంది తెరవెనుక బాధ్యతతో పనిచేసినట్లు తెలిపాడు. ఓ జట్టు ఎంత ఉత్తమంగా ఉంటుందో.. కోచ్ కూడా అలాగే ఉండాలని, ఆటగాళ్లనే తనను కోచ్‌గా మార్చేశారని గంభీర్ అన్నాడు. ఈ ట్రోఫీని ద్రావిడ్, లక్ష్మణ్‌లకు అంకితం ఇస్తున్నట్లు వెల్లడించాడు. జట్టును ఈ దశకు తీర్చిదిద్దినందుకు రాహుల్ ద్రావిడ్‌కు.. సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లో ఆటగాళ్లను తీర్చిదిద్దినందుకు లక్ష్మణ్‌కు ఈ ట్రోఫీ దక్కాలన్నాడు. అలాగే చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్, ఐసిసి చైర్మన్ జేషాకు కూడా థ్యాంక్స్ చెప్పాడు.



# పేదల వర ప్రసాదిని సీఎంఆర్ఎఫ్..

**రాయదుర్గం - సూర్య వాస్తవం:** అత్యవసర పరిస్థితుల్లో ప్రైవేటు, కార్పొరేట్ వైద్యశాలల్లో వైద్య సేవలు అందుకున్న నిరుపేద కుటుంబాలకు సీఎం రిలీఫ్ ఫండ్ ఒక వరం లాంటిదని ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు పేర్కొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు పెద్ద మనసుతో ఆయా కుటుంబాలను ఎలాగైనా ఆదుకోవాలన్న ఉద్దేశంతో ఆర్థిక చేయూత అందిస్తున్నారన్నారు. రాయదుర్గంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో 34 మందికి రూ.11 లక్షల విలువైన చెక్కులను సోమవారం ఆయన పంపిణీ చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన 20 నెలల కాలంలోనే రాయదుర్గం నియోజకవర్గ వ్యాప్తంగా 269 మందికి రూ.2.23 కోట్లు ముఖ్యమంత్రి సహాయ నిధి ద్వారా పేదలకు అందజేయడం చాలా సంతృప్తినిచ్చిందన్నారు.

ఎవరైనా అత్యవసర పరిస్థితుల్లో వైద్యానికి డబ్బు సర్దుబాటు చేసుకున్నవారు సంబంధించిన బిల్లులను తీసుకువస్తే తప్పకుండా ఎంతో కొంత మొత్తాన్ని ప్రభుత్వం ద్వారా ఇప్పించడానికి ప్రయత్నం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యువ నాయకులు కాలవ భరత్, పట్టణ అధ్యక్షుడు బండి కృష్ణ మూర్తి, మండల కన్వీనర్లు కురుబ హనుమంతు, జిల్లా అధికార ప్రతినిధి పసుపులేటి నాగరాజు, కార్పొరేషన్ డైరెక్టర్ పోరాళ్ల పురుషోత్తము, మాజీ డైరెక్టర్ టశీకశాల హనుమంతు, కురుబ ప్రశాంతి, బుళ్లారి జ్యోతి, బండి భారతి, సంపత్ కుమారి, కెపి దొడ్డి నాగరాజు, భలే శంకర్, ఎల్లప్ప, రావుత్ రాజశేఖర్, అగ్రహారం కిరణ్, పైతోట రామంజి, తదితరులు పాల్గొన్నారు.







# అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో పాల్గొన్న మార్కెట్ కమిటీ చైర్మన్

**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** రాయచోటి నియోజకవర్గం, రాయచోటిలోని ఆర్డీవో కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన అంతర్జాతీయ మహిళా దినోత్సవ వేడుకలలో రాయచోటి మార్కెట్ కమిటీ చైర్మన్ అనుంపల్లి రాంప్రసాద్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మహిళలు కుటుంబానికి పరిమితం కాకుండా ఆర్థిక వ్యవస్థలో, విద్య వ్యవస్థలో, ఉద్యోగ వ్యవస్థలో కీలక భాగ్యస్వాములుగా ఉండాలని మహిళను ఉద్దేశించి ప్రస్తావించారు. మన తెలుగుదేశం ప్రభుత్వం వంటింటి భారాన్ని తగ్గించేందుకు ఉచిత గ్యాస్ సిలిండర్ అందించారు. అలాగే ఉచిత బస్సు ప్రయాణం ద్వారా ఇప్పటికే మహిళలు లబ్ధి పొందారని తెలిపారు. డ్వాక్రా మహిళల అభివృద్ధి కోసం రుణ పరిమితిని రూ.2 లక్షల నుంచి రూ.5 లక్షలకు పెంచడం, ఎస్సీ, ఎస్టీ మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం రూ.5 లక్షల వరకు వడ్డీ లేని రుణాలు అందించడం, "తల్లికి వందనం" పథకం ద్వారా 67 లక్షల మంది తల్లులకు రూ.10 వేల కోట్లను నేరుగా ఖాతాల్లో జమ చేయడం వంటి పథకాలు మహిళల సాధికారతకు తోడ్పడుతున్నాయని తెలియజేశారు. చిన్న మండెం మండలంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ వారి సౌజన్యంతో పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో సోమవారం



ఉచిత పశు వైద్య శిబిరం నడిగడ్డ పల్లెలో నిర్వహించడం జరిగినది ఈ శిబిరానికి ముఖ్యఅతిథిగా గౌరవనీయులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఆంధ్రప్రదేశ్ రవాణా, యువజన క్రీడా శాఖ మంత్రి, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బి.రాంప్రసాద్ రెడ్డి, వారి సిబ్బంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కే గుణశేఖర పిల్లై జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి డాక్టర్ డి.మాలకొండయ్య ఉపసంచాలకులు రాయచోటి డాక్టర్ టి.శ్రీధర్ రెడ్డి సహాయ సంచాలకులు సంబేపల్లి మండలం, పశువైద్య సిబ్బంది పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో 350 పశువులకు గర్భధారణ ఖనిజ లవణముల మిశ్రమం, క్యాల్షియం, టానిక్ మందులు 60 మంది లబ్ధిదారులకు, సరఫరా చేశారు. 40 దూడలకు నట్టల నివారణ మందు తాగించారు.

# ఘనంగా బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి జన్మదిన వేడుకలు

**పెళ్లకూరు - సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా ఓజిలి మండలం ఆరిమానుపాడు గ్రామంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి జన్మదిన వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. మండల బీజేపీ అధ్యక్షులు బిల్లు పవన్ కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు,



కార్యకర్తలు పాల్గొని కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా బిల్లు పవన్ కుమార్ యాదవ్ విలేకరులతో మాట్లాడుతూ సన్నారెడ్డి దయాకర్ రెడ్డి క్రమశిక్షణతో పనిచేస్తూ అంచెలంచెలుగా ఎదిగి భారతీయ జనతా పార్టీ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు నిర్వహించడం కార్యకర్తలకు గర్వకారణమన్నారు. ఆయన నాయకత్వం పార్టీ కార్యకర్తలకు స్ఫూర్తినిస్తూ, నాయకులకు ఎల్లప్పుడూ అండగా నిలుస్తూ భరోసా కల్పిస్తున్నారని తెలిపారు. బీజేపీలో యువతకు ప్రాధాన్యత ఇస్తూ పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న సమర్థ నాయకుడు సన్నారెడ్డి దయాకర్ రెడ్డి అని కొనియాడారు. ఆయన బాటలో నడుచుకుంటూ ఓజిలి మండలంలో భారతీయ జనతా పార్టీని మరింత బలోపేతం చేసేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. అలాగే భగవంతుని ఆశీస్సులతో ఆయురా రోగ్యాలతో ఉండి మరెన్నో పుట్టినరోజులు జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు రవీంద్ర రాజు, వర ప్రసాద్, వెంకటేశ్వర్లు రాజు, ఫణి, రాపూరు వెంకటేష్, కోటి, అనిల్, జగదీష్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.




# జాతీయస్థాయి అబాకస్‌లో శ్రీ వివేకానంద హైస్కూల్ విద్యార్థి ప్రతిభ

**సింహాద్రిపురం - సూర్య వాస్తవం:** నైపుణ్య విద్యలో ప్రముఖ సంస్థ అయిన విశ్వం ఎడ్యుటెక్ వారు జాతీయస్థాయి అబాకస్, వేదిక్ మాథ్స్ కాంపిటీషన్స్‌ను ఆదివారం కూకట్‌పల్లిలోని పిఎన్ఎమ్ ఆడిటోరియంలో ఘనంగా నిర్వహించారు. ఈ పోటీలలో భారతదేశంలోని 10 రాష్ట్రాల నుండి సుమారు 250 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో సింహాద్రిపురం శ్రీ వివేకానంద పాఠశాల నుండి యు.మోనీశ్వర్ రెడ్డి ప్రథమ స్థాయిలో ప్రతిభ కనబరిచినందుకు 5000 రూపాయల నగదు బహుమతి, ప్రశంసా పత్రం, షీల్డ్‌ను బహూకరించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ కె.ఖాదరవలి, డైరెక్టర్ ఎం. జాఫర్ హెడ్ మిస్ట్రెస్ ఎస్. షహనాజ్ బేగం, ఉపాధ్యాయ బృందం విద్యార్థిని అభినందించారు. ఈ విద్యార్థి అంతర్జాతీయ స్థాయిలో జరిగే పోటీలకు అర్హత సాధించాడు.

# జనసేన ఉద్యమి సభ్యత్వ నమోదు

**కార్యక్రమం విజయవంతం చేయాలి**

**- కష్టపడే ప్రతి కార్యకర్తకు పార్టీలో గుర్తింపు ఉంటుంది**

**- ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపు**





**నాయుడుపేట - సూర్య వాస్తవం:** జనసేన పార్టీ చేపట్టిన ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయ వంతం చేయాలని తిరుపతి ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పిలుపునిచ్చారు. సోమవారం నాయుడుపేట పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు విలేకరులతో మాట్లాడుతూ, పార్టీ కోసం కష్టపడి పనిచేసే ప్రతి కార్యకర్తకు జనసేనలో తగిన గుర్తింపు ఉంటుందన్నారు. తిరుపతి పార్లమెంట్ పరిధిలోని ప్రతి జనసేన కార్యకర్తకు తాను ఎల్లప్పుడూ అండగా ఉంటానని తెలిపారు. నాయకులు, వీర మహిళలు మరింత చురుకుగా పనిచేసి ఈ నెల 10వ తేదీ లోపల సభ్యత్వ నమోదు లక్ష్యాలను పూర్తి చేయాలని సూచించారు. జనసేన పార్టీ సూళ్లూరుపేట నియోజకవర్గ ఇన్‌చార్జి, నాయుడుపేట ఏఎంసీ చైర్మన్ ఉయ్యాల ప్రవీణ్ మాట్లాడుతూ, పార్టీ అధినేత, రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలు, పార్టీ సిద్ధాంతాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయడమే ఈ కార్యక్రమం లక్ష్యమని తెలిపారు. ఉద్యమి సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి కృషి చేస్తున్న నాయకులు, వీర మహిళలకు ఆయన అభినంద నలు తెలిపారు. అదే ఉత్సాహంతో కార్యక్రమాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సుమారు 30 మంది జనసేన పార్టీలో చేరారు. వారిని ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో నాయుడుపేట జనసేన పార్టీ సీనియర్ నాయకులు అట్ల కృష్ణారావు, బి. సురేష్ నాయుడు, కృష్ణ యాదవ్, మోహన్, భవాని, గిండి సతీష్, బాలుశెట్టి తదితర నాయకులు పాల్గొన్నారు.

# దివ్యాంగులు, వయోవృద్ధులకు గుర్తింపు శిబిరం

**- ఎంపీడీవో కె.సురేష్ - 11న నాయుడుపేటలో నిర్వహణ**

**నాయుడుపేట - సూర్య వాస్తవం:** తిరుపతి జిల్లా నాయుడుపేట పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ఈనెల 11వ తేదీన దివ్యాంగులు, వయోవృద్ధుల కోసం ప్రత్యేక గుర్తింపు శిబిరం నిర్వహించనున్నట్లు నాయుడుపేట ఎంపీడీవో కె. సురేష్ బాబు తెలిపారు. ఉదయం 8 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు ఈ శిబిరం కొనసాగుతుందని ఆయన వెల్లడించారు. శిబిరంలో దివ్యాంగులు, వయోవృద్ధులకు వైద్య పరీక్షలు నిర్వహించి, వారికి అవసరమైన సహాయ పరికరాలు ప్రభుత్వం ద్వారా అందజేయడానికి అర్హులను ఎంపిక చేస్తారని తెలిపారు. మండలంలోని దివ్యాంగులు, వయోవృద్ధులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని శిబిరానికి హాజరుకావాలని ఎంపీడీవో కె. సురేష్ బాబు విలేకరులతో మాట్లాడుతూ కోరారు.

# గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై అవగాహన

**లక్కిరెడ్డిపల్లి - సూర్య వాస్తవం:** మండల కేంద్రంలోని విశ్వ భారతి ఉన్నత పాఠశాలలో సోమవారం ఎస్సై గోల్కొండ శోభ గుడ్ టచ్ బ్యాడ్ టచ్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ గోల్కొండ శుభ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి గుడ్ టచ్, బ్యాడ్ టచ్‌పై అవగాహన కలిగి ఉండాలని, ఎవరైనా మీకు తెలిసిన వ్యక్తులు గాని తెలియని వ్యక్తులు గాని మీతో ఏదో విధంగా మాట్లాడడానికి ప్రయత్నించి ఎక్కడపడితే అక్కడ టచ్ చేస్తే



వెంటనే మీరు భయపడకుండా మీ తల్లి దండ్రులకు గానీ, ఉపాధ్యాయులకు గాని, పోలీసులకు గాని సమాచారం అందించాలన్నారు. ఒకవేళ మీకు చెప్పడానికి భయమైనట్లయితే వెంటనే 1098,112 అనే నంబర్లకు ఫోన్ చేసి తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ మొబైల్ ఫోన్లో శక్తి యాప్ ను డౌన్లోడ్ చేసుకొని శక్తి ఆప్ పై అవగాహన పెంపొందించుకోవాలన్నారు. ఎవరైనా గుర్తు తెలియని వ్యక్తులు తినుబండారాలు ఇస్తే వాటిని తీసుకోకూడదన్నారు. అనంతరం జిల్లా ఎస్పీ ధీరజ్ రిలీజ్ చేసిన గుడ్ టచ్ బ్యాడ్ టచ్ పై వీడియో ను విద్యార్థులకు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కరెస్పాండెంట్ రఘునాథ రాజు, హెడ్ మాస్టర్ రవీంద్ర, శక్తి టీం పీరమ్మ, సాగర్ రెడ్డి, రామంజులు రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

# జనసేన సభ్యత్వ నమోదు

**ఉరవకొండ - సూర్య వాస్తవం:** కూడేరు స్థానిక బస్టాండ్ ఆవరణంలో సభ్యత్వ నమోదు కార్యక్రమం జరిగింది. స్థానికంగా ఉన్న యువత మహిళలు గ్రామస్తులు స్వచ్చందంగా జనసేన " ఉద్యమి " క్రియాశీలక సభ్యత్వ నమోదు కార్యక్రమంలో పెద్ద ఎత్తున భాగస్వాములయ్యారు. ఈ కార్యక్రమంలో ఉరవకొండ జనసేన ఇంచార్జ్ గౌతమ్ కుమార్



పాల్గొని సభ్యత్వ నమోదు రేపే చివరి రోజు అయినందున ప్రతి జనసైనికుడు వీరమహిళలు జనసేన అధినేత ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆశయాలను ఆయన చేస్తున్న అభివృద్ధిని ప్రజలకి వివరించి సభ్యత్వ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చాడు. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు రాము, శేఖర్, శివ, సద్దార్, అంజి, కుమార్, వర్మ, పాల్గొన్నారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS , 13-2-819-2 RAMBOW RESIDENCE , RTC BUS STAND ROAD, SRINIVASA NAGAR, ANANTAPURAM, ANDHRAPRADESH-515001, VIJ. ADDRESS : SHEETAL APARTMENT, TF2 DR NO : 30-2-15/IE VIJAYAWADA-10, EDITOR : M.IRSHAD BAIG, CELL : 918500425222 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )